# విశ్వాసాన్ని పెంపొందించే విజ్ఞానం

చాలామంది ఆస్తికులు "మనకు దైవంపట్ల విశ్వాసమున్నది గదా, యిక విజ్ఞానమెందుకు?" అన్న ప్రశ్న వేస్తుంటారు. వీరి దృష్టిలో విజ్ఞానాన్ని ఆర్జించే యత్నమంతా భగవద్ధ్యానంలో హృదయాన్ని నిలుపక కాలాన్ని వృథాగా గడిపేయడంగా తోస్తుంది. అంతేగాదు, పరమ పవిత్రమైన దైవతత్త్వాన్ని బుద్ధి, యింద్రియాల సహాయంతో ఆర్జించక క్షుద్రము, లౌకికమూ అయిన విజ్ఞానంతో జోడించే యత్నం అనుచితమని వీరు తలుస్తారు. పవిత్రమైన సత్యాన్ని అపవిత్రపరచడమో, అగౌరపరచడమో అనిపిస్తుంది వీరికి.

కాని యిది సమంజసమా? ఆత్మవేత్తలైన మహర్షులందరూ "సర్వం ఖల్విదం బ్రహ్మ" అన్నారు – "ఇదంతా బ్రహ్మమే" అన్నారు. కేవలం మన అజ్ఞానం వలన యీ భౌతిక జగత్తు పరమాత్మకంటే భిన్నంగా మనకుతోస్తుందేగాని నిజానికిది వాసుదేవమయమని వారంతా చెప్పారు. విశ్వమంతా తనరూపమేనని అటు కృష్ణుడు విశ్వరూప సాక్షాత్కారంలో అర్జునుడుకి తెల్పితే, యీనాడు సాయిబాబా యీ విశ్వంలోని రూపాలన్ని తమవేనని భక్తులందరికీ అనుభవపూర్వకంగా నిరూపించారు. కాని ఆయన ఎన్నినిదర్శనాలు చూపినా వారి ప్రత్యక్ష భక్తులుగూడ తిరిగి తిరిగి సాటివారిపట్ల, మతాలపట్ల పామరభావాన్ని వహించడం చరిత్రలో చూడవచ్చు. అటువంటి సాయి మనకు భౌతికంగా పరోక్షంగా వున్న యీ కాలంలో మనం వారు బోధించిన సత్యాన్ని తిరిగి తిరిగి మననం చేసుకొంటూండాలి. అందుకు ప్రాచీన ఆత్మవేత్తలందరూ మార్గాన్ని తెల్పారు. సంసారంలోనే నిర్వాణాన్ని ఎలా గుర్తించాలో బుద్ధుడుగూడ బోధించాడు. ఎందరు మహనీయులో యీ సత్యాన్ని తమ భక్తులకు దివ్యానుభూతులద్వారా నిరూపించారు. కనుక ఆ పరమసత్యాన్ని మనం నిత్యజీవితంలో తిరిగి తిరిగి వేరు కోణాలలోంచి మననం చేసుకొంటూంటేనే ఈ జగత్తుపట్ల దివ్యభావం కొంతకాలానికి స్థిరపడుతుంది. అందుకే సాయి, "పనిచేయి, సద్గ్రంథాలు పఠించు, దైవాన్ని స్మరించు" అన్నారు. మనం మరచినపుడల్లా సరైన దృక్పథాన్ని మనలో తిరిగి నెలకొల్పే గ్రంథాలే సద్గ్రంథాలు. వాటిని చదవడం, మన అజ్ఞానయుతమైన యోచనారీతిని పరిశుద్ధం చేయడంకోసమే. సద్గ్రంథాలు చదవడమే "విజ్ఞానాన్ని" ఆర్జించటమంటే! లేకుంటే అది అజ్ఞానమే అవుతుంది. గ్రంథపఠనచేసే చిత్తస్థైర్యము, విరామములేని ఆధునికులకు సద్గ్రంథాల సారాన్ని, మహనీయుల బోధలను, వాటిని మన హృదయంలో నాటగల మహనీయుల చరిత్రలను చదువరులకు అందిస్తుండడమే 'సాయిబాబా' పత్రిక యొక్కలక్ష్యము. విజ్ఞానార్జన సంసారంలో జీవించే సామాన్య ముముక్షువులకు అత్యావశ్యకం. అలాటి విజ్ఞానం మనలో మిణుకు మిణుకుమనే కొద్దిపాటి విశ్వాసాన్ని దేదీప్యమానమొనర్చే యింధనము.

# సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

సంపుటి: 27 సెప్టెంబరు 2009 సంచిక: 5

OFFICIAL ORGAN OF MASTER UNIVERSAL SAI TRUST

చీఫ్ ఎడిటర్: శ్రీ పోలూరి శ్రీనివాసరావు బి.ఎ.ఎల్.ఎల్.బి

ఎగ్జిక్యూటివ్ ఎడిటర్: శ్రీ జె.శ్రీనివాసరావు, ఎమ్.ఎస్.సి

SRI MASTER UNIVERSAL SAI TRUST ONGOLE

**చందా వివరములు**

| | | |
|---|---|---|
| విడిప్రతి | : | రూ. 10-00 |
| సంవత్సర చందా | : | రూ. 100-00 |
| జీవిత చందా | : | రూ. 1,116-00 |

(సం॥లోపల 5 తేలిక వాయిదాలలో చెల్లించవచ్చును)
(20 సం॥లపాటు మీకు పత్రిక పంపబడుతుంది)

| | | |
|---|---|---|
| రాజపోషకులు | : | రూ. 3,000-00 |
| మహారాజపోషకులు | : | రూ. 5,000-00 |

**చిరునామా**

**శ్రీ మాస్టర్ యూనివర్సల్ సాయి ట్రస్ట్, మంగమూరు డొంక, ఒంగోలు-2.**

**ఫోన్ నెం: 08592 - 233271**

website: www.saibharadwaja.org

www.saimasterforums.org

# విషయసూచిక:

| | |
|---|---|
| 1. విశ్వాసాన్ని పెంపొందించే విజ్ఞానం | 01 |
| 2. సంకుచిత మతద్వేషాల పరిధులు దాటించే సీమోల్లంఘనం! | 03 |
| 3. ఈనాడే సీమోల్లంఘనము! | 06 |
| 4. శ్రీ సాయి సచ్చరిత్ర | 08 |
| 5. బాబా చిత్రపటం-3 (పూజ) | 11 |
| 6. వార్తాలాపము | 14 |
| 7. శ్రీ భరద్వాజ లేఖామృతం | 17 |
| 8. మనము అసలు ఎందుకు చదువుకోవాలి! | 19 |
| 9. శ్రీ దత్తలీలామృతము | 21 |
| 10. 'బాలోన్మత్త పిశాచవత్' అన్న శాస్త్రవర్ణనకు వాస్తవరూపం | 23 |
| 11. ఇలా ఆలోచిద్దామా? | 26 |
| 12. శ్రీ సాయి లీలామృతము | 28 |
| 13. ఆధునిక శాస్త్రం - సృష్టి రహస్యం | 30 |

## ధన్యవాదములు

ఈ సంచిక ముద్రణకు ఆర్థిక సహకారము అందించిన వారు:

1. శ్రీ మంగ భరద్వాజ ట్రస్ట్
2. www.saibharadwaja.org
3. Sai Master Forums Online సత్సంగ సభ్యులు

**వీరిని శ్రీ సాయి మాస్టర్ సదా అనుగ్రహించుగాక!**

సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.
శ్రీ మాస్టర్ యూనివర్సల్ సాయి ట్రస్ట్కు ఎటువంటి బాధ్యతా లేదు.

# సంకుచిత మతద్వేషాల పరిధులు దాటించే సీమోల్లంఘనం!

**విజయదశమి సందర్భంగా ప్రత్యేక వ్యాసం**

**ఆచార్య భరద్వాజ**

అది 1916. నాడు విజయ దశిమి. పరాశక్తికి రాక్షసులపైన విషయం చేకూరిన రోజు, బహుశ మనదేశంలోని సాధకులు తమలో ప్రాకృతికంగా ఉత్పన్నమయ్యే ఆసురీ, రాక్షస సంస్కారాలపైన విజయం సాధించవలసిన నియత దినంగా పెట్టుకొని సాధన చేసేవారు గాబోలు. రాజుల దిగ్విజయానికై దైవాన్ని పూజించి, పూజించబడిన ఆయుధాలను ధరించి ఊరేగింపుగా పట్టణ సరిహద్దు లేక సీమదాటి, తిరిగివచ్చేవారు. దీనికి స్మృతిచిహ్నంగా సీమోల్లంఘనోత్సవము నేటికీ మహారాష్ట్ర దేశంలో జరుపుకుంటారు. పామరులు సాటివారిపట్ల గల అసూయ, ద్వేషాదిభావాల వలన ఏర్పడిన సంకుచితమైన మానసిక అవరోధాలను దాటి, వాటిని మరచి, ఒకరినొకరు శమీ పత్రిలిచ్చు కోవడం ద్వారా అలా చేయమని హెచ్చరించుకొని ఆలింగనం చేసుకొనేవారు. ఇదీ ఒక సీమోల్లంఘనమే; 'శమీ' పూజే!

నాడు శిరిడీ ప్రజలు, సాయి దర్శనార్థమొచ్చిన భక్తబృందమూ వేడుకతో గ్రామపొలిమేర దాటి తిరిగి మసీదు జేరుకున్నారు. సాయంత్రం చీకట్లు అలుముకుంటున్నాయి. అందరి హృదయాలలో మసీదును సమీపించగానే సాయి ముస్లిమా లేక హిందువా అన్న ప్రశ్న యథా ప్రకారం తలెత్తింది గాబోలు. సాయి శివమెత్తిన ఆగ్రహంతో, చింతనిప్పలవంటి కన్నులతో మసీదు మెట్ల వద్ద నిలచి కేకలు వేస్తున్నారు. తన వంటిమీద నున్న గుడ్డలన్నీ తీసి ధునిలో పారవేసి మూర్ఖులారా! నేను ముస్లింనో, హిందువునో యిప్పడు చూచి తేల్చుకోండి!!" అని అరుస్తున్నారు. భక్తులు భయంతో నిలబడి పోయారు. భాగోజీ అనే సేవకుడు మాత్రం ఆయనను సమీపించి, వారి నడుముకు లంగోటి చుట్టి, "బాబా! ఈ రోజు పవిత్ర సీమోల్లంఘనోత్సవం జరుగుతూంటే మీరెందుకు ఆగ్రహించి భక్తులను భయపెడుతారు?" అన్నాడు.సాయి శాంతించక, "అవును, యీ దినమే నా సీమోల్లంఘనం!" అని కేకలేశారు. కారణం? తాను పరమాత్మ తత్వమని, ఏమతస్థుడూకాడని. అయితే ఆయన అన్ని మతాలకు చెందిన వాడేనని, ఆయనెన్ని విధాల తెలియజూపినా వారా విచికిత్స మానలేదు. తన మతము కబీరని, తన కులము భగవంతు ("పర్వర్దిగార్") డనీ ఎంత చెప్పినా వారు వినరాయె! ఇంత గమనించాక కూడా కొందరు వారికి ముస్లిం సాంప్రదాయం ప్రకారం "సున్తి" చేయబడినదని, కొందరు ఆయనకు సున్తి జరుగలేదనీ నిశ్చయించారు! ఇరుపక్షాలవారు కలసియైన ఆయన చెప్పదలచిన సత్యాన్ని గ్రహించలేదు. బాహ్యంగా సీమ దాటారేమో గాని అంతరంగంలో వారు సీమలు దాటలేదు. సాయిని వారి హృదయాలలోని యీ సంకుచిత బావాలనే 'నూనెవర్తకులు, దుకాణదారులు' బాధిస్తూనే వున్నారు. ఇంకొక సీమోల్లంఘనం జరుగవలసివున్నది. తర్వాత ఒక

రాత్రి భక్తులు బూటీ, షామా, దీక్షిత్ వాడాలో నిదురిస్తుండగా యిద్దరికీ సాయి స్వప్న దర్శనమిచ్చి "ఇక్కడ ఒక మందిరాన్ని, భవనాన్ని నిర్మించండి. నేనక్కడుండి భక్తుల కోరికలు నెరవేరుస్తాను!" అన్నారు. అదే ఆదేశంగా తీసుకుని బాబా అనుమతితో నిర్మాణం ప్రారంభమైనది. భవనంలో క్రిందిభాగంలో మురళీధరుని ఆలయాన్ని బూటీ ఏర్పాటు చేయించి విగ్రహం తయారుచేయమనీ శిల్పులనాదేశించాడు. ఇంకా దాటవలసిన సీమలాయనకు గూడ వున్నాయి. భగవద్గీతలో ఆ మురళీధరుడే సద్గురువునే మోక్షం కోరకాశ్రయించాలని చెప్పినా బూటీ గుర్తించక తన పిచ్చిలో తానున్నాడు.

సం॥ 1918 ఆరంభమైంది. ఉద్ధవేశ్, చంద్రాబాయి మొ॥ భక్తులతో సాయి ఒకసారి "ఇకనుంచి మీరింత శ్రమపడి యిక్కడకు రానక్కరలేదు" అన్నారు.

ఒకరోజు కాశిమ్ అనే భక్తునితో సాయి "ఔరంగాబాదు వెళ్ళి షంషుద్దీన్ మియా అనే ఫకీరుకు నేనిచ్చే రూ.250/- యిచ్చి, 'తొమ్మిదవ నెలలో తొమ్మిదవ రోజు అల్లా పెట్టిన దీపం అల్లా తీసుకుపోతారు", అని చెప్పు. మౌలూ, కవ్వాలీ, నియాజ్ జరిపించమను, తర్వాత బన్నేమియా అను ఫకీరును దర్శించి అమాటే చెప్పి మెడలో నేనిచ్చే మాలవెయ్యి!" అని ఆపైకము, మాల యిచ్చారు.

కాశిమ్, చోటేఖాన్ అనే అతడి అనుచరుడు, ఔరంగాబాదు చేరేసరికి రైలు స్టేషన్‌కు ఒక ఫకీరు వచ్చి పెట్టెలదగ్గర "శిరిడీ సాయి ఫకీరు వద్ద నుండి వచ్చినవారెవరు?" అని అరుస్తున్నాడు. అతడే షంషుద్దీన్ అని తెలిసి నమస్కరించిన అగంతకులతో ఆ ఫకీరు సాయి సందేశాన్ని తానే యథాతంథంగా వల్లించేశాడు! ముగ్గురినీ యింటికి అతిధ్యమిచ్చి నాటి రాత్రి మౌలు, కవ్వాలి (సంకీర్తన, భజన) జరిపించి పేదలకన్నదానం (నియాజ్) జరిపించాడు. షంషుద్దీన్.

మరుసటి ఉదయం వీరు వెళ్ళేసరికి బన్నేమియా ఫకీరు యోగసమాధిలో ఒక చేయి ఆకాశంవైపు చాపి, రెండవ చేయి క్రిందకు చాపి, కన్నార్పక నిలుచుని వున్నారు. ఆ స్థితిలో వారిని పలకరిస్తే ఆగ్రహించి దండిస్తారని అచటవున్న అరబ్బులు అగంతకులతో చెప్పారు. కొంత సేపు వేచిచూచి, చోటెఖాన్ శ్రీసాయిని స్మరించి, బన్నేమియా మెడలో సాయి పంపిన మాలవేశాడు. మరుక్షణమే ఆ మహనీయుడు యోగ సమాధి నుండి మేల్కొని సాయి పంపిన కబురు విని, ఆకాశంకేసి చూచి కన్నీరు కార్చారు. తన గురువాజ్ఞను పాటించి "ఎంతటి మహనీయుడైనా మానవాకారంలో వున్న వారికి మాల వేయరాదు" అనే సీమనుల్లంఘించారు.చోటేఖాన్, కాశిమ్‌లు. అందుకే వారికంతటి భాగ్యాన్ని ప్రసాదించారు సాయి.

అక్టోబరు మాసమారంభమైనది. బాబా భిక్షకు వెళ్ళారు. మాధవ్‌ఫస్లే అను సేవకుడు మశీదు చిమ్ముతున్నాడు. సాయికి ప్రాణసమానమైన ఇటుక నేల మీద వున్నది. అది తమ గురు ప్రసాదమని చెప్పి సాయి ఎప్పుడూ దానిపైన చేయివుంచి కూర్చోడము, తలక్రింద వుంచుకుని పడుకోవడమూ చేసేవారు. దానిమీద దుమ్ము పడకుండా ఫస్లే దానిని తీయబోయాడు, చేయి జారి క్రిందపడి అది విరిగింది.

సాయి తనపై ఆగ్రహిస్తారని భయపడ్డాడు ఫస్లే. తర్వాత దానిని చూచి సాయి ఏంతో బాదగా, "విరిగినది యిటుక కాదు. అది నా ప్రాణం; నా ప్రారబ్దమే విరిగింది. నేనిక ఎక్కువ కాలం జీవించను" అన్నారు. దానిని బంగారంతో అతికించి యిస్తానన్నాడు బూటీ. బాబా నవ్వి, "అదలా అతికేది కాదు" అన్నారు. అక్టోబరు 3వ తేది పురందరే, దీక్షిత్‌లతో బాబా, "నేను మొదట వెడతాను. మీరు వెనుక వస్తారు" అన్నారు. తిరిగి వారికి ఊది ఇచ్చి సాగనంపుతూ, "నా సమాధి మాట్లాడుతుంది. నా మట్టి సమాధానం చెబుతుంది!"అన్నారు. స్వస్తులు అయిన బాబా అలా ఎందుకు పలికారో వారికర్థం గాలేదు.

విజయదశమి సమీపించింది. సాయికి జ్వరమొచ్చింది. ఆయన బిక్షకు, లెండీకీ వెళ్ళడం మానేశారు. విజయదశమి వారం రోజులు ఉన్నది. ఆరోజే ప్రారంభించి, వాఘే అను భక్తుని చేత "రామ విజయం" అనే సద్గ్రంథాన్ని ఒక వారంలో మూడు సార్లు చదివించుకొని విన్నారు సాయి. అ తర్వాత తమ సమయమంతా మౌనంగా గడప సాగారు బాబా. ఔరంగాబాదు ఫకీర్లకు ఆయన పంపిన వర్తమానాన్ని గూర్చి విని బాబా ముస్లిమని నిర్ణయించడానికి వీలు లేకుండా సాయి ముందే జాగ్రత్త పడ్డారు.

విజయదశమి తెల్లవారింది. భక్తులందరికి సాయి విషయమై ఆందోళన పెరిగింది. కాని పెదవి విప్పి మాట్లాడే అవకాశాన్ని ఆయనెవ్వరికి ఇవ్వలేదు. ఆయన దృష్టిలో సమాధి ఒక ఊయలే; మరణమొక నిదురే! కళ్ళు తెరచి మెలుకువగా నిద్రించగల సాయికి మరణమెక్కడిది? కనుక దు:ఖించేందుకు మాట్లాడేందుకూ ఏముంది? శ్రీ సాయి లక్ష్మిబాయి షిండే అను భక్తురాలిని పిలిచి ఆమెకు మొదట రూ.4/-లు తర్వాత 5/- ఇచ్చి బద్రపరుచుకో మని చెప్పారు.

మద్యాహ్న హారతి యథావిదిగా జరిగింది. అప్పుడే దశమి ఘడియలు గడిచి ఏకాదశి ప్రవేశించింది. భక్తులందర్ని భోజనాలు చేసిరమ్మని పంపారు బాబా. శ్రీమతి లక్ష్మిబాయి షిండే, భాగోజీ, శ్రీమతి బాయాజ బాయి. బాలా షింపే, నిమోన్కర్‌లు మాత్రం బాబా చెంత నుండిపోయారు.

సాయి షింపేతో "అబ్దుల్లానురమ్మను!" అన్నారు. అతడు పరిగెత్తాడు. కొద్ది నిమిషాలు సాయి అబ్దుల్లా కోసం గాబోలు మశీదు గేటు కేసి చూస్తూండిపోయారు. మరుక్షనమే అక్కడివారితో, "నాకీమశీదులో వుంటే ఏమి బాగాలేదు. నన్ను ఆ రాతి మేఢ (బూటీ వాడా)లోకి తీసుకుపోండి, బాగుంటుంది." అంటూనే సాయి బాయాజ బాయి వైపుకు ఒరిగి కన్ను మూసారు. భాగోజీకి అనుమానం వచ్చి నిమోన్కర్‌తో చెప్పాడు. అతను బాబా నోటిలో నీరు పోసి, అవి బయటకు వచ్చెయడంతో నిమోన్కర్ సాయి తనువు చాలించారని గుర్తించి పెద్దగా ఏడ్వనారంభించాడు. అందరూ గొల్లుమన్నారు. క్షణంలో శిరిడీ గ్రామమంతా అసువులు వీడిన శవంలా అయింది. గ్రామస్తులు, భక్తులు హృదయవిదారకంగా శోకిస్తూ మశీదు చేరారు. కొందరు స్మృహ తప్పి పడిపోయారు; కొందరు రోదించారు; కొందరు దు:ఖము, కన్నీరు పెగలక బిగుసుకు పోయారు.

Continued on page 10..

# ఈనాడే సీమోల్లంఘనము!

(నవరాత్రి మహోత్సవ ప్రత్యేక వ్యాసం)

- ఆచార్య భరద్వాజ

విజయదశమి సందర్భంగా మహారాష్ట్ర దేశమంతటా సీమోల్లంఘనోత్సవం చేస్తారు. గ్రామస్థులంతా కలసి మేళతాళాలతో పూజా ద్రవ్యాలతో గ్రామ పొలిమేరలదాకా వెళ్ళి, అక్కడ పూజ చేస్తారు. తర్వాత గ్రామంలోని ప్రతి ఆలయంలోనూ శమీపత్రం దైవానికర్పించి నమస్కరించుకొని వస్తారు. అటుతర్వాత గ్రామంలోనివారంతా ఒకరికొకరు శమీపత్రమిచ్చి, ఆలింగనం చేసుకొని నమస్కరించుకొంటారు. దీని అంతరార్థం కొంచెమాలోచిస్తే తెలుస్తుంది. బహుశ: మన రాష్ట్రంలో జరిగే 'పారువేట' గూడ దీని రూపాంతరంగావచ్చు.

దైవసృష్టి యందంతటా ప్రకృతిలో అన్ని వస్తువులూ, ప్రాణులూ తెలిసో తెలియకో ఒకానొక సహకార కుటుంబంగా జీవిస్తాయి. ప్రతిజీవి ప్రకృతి యొక్క సామాన్యునికవసరమని నేటి మన జ్ఞాన శాస్త్రవేత్తలు (Ecologists) గుర్తిస్తున్నారు. అందుకే ఈ సృష్టియంతటినీ యజ్ఞంగా వేదఋషులు గానంచేసారు. ఒకే దైవశక్తియా నానాత్వాన్ని ధరించి, మౌలికమైన ఏకత్వ ప్రభావం వలన ఒకానొక సమైక్యతతో, సామరస్యంతో నడుస్తుంది. ప్రకృతిలోని ప్రాణులలో నుంచే జాతి వైరము, ఒక ప్రాణిని తిని మరొకప్రాణి మనడం గూడా యీ ప్రకృతిలో సామ్యం నిలపడానికి సహకారి అవుతుంది. సృష్టీ, సంహారము గూడా ప్రకృతిమాత యొక్క బాహువులే, జగన్మాత యొక్క రూపంలో సంహారాత్మకమైన ఆయుధాలెంత భాగమో, వరదాభయ ముద్రలు గూడ అంతే భాగం. రెండూ కలసే దైవం యొక్క కృపకూ, జగన్మాత్వానికీ సంకేతాలు అటువంటి జగన్మాత యొక్క లీలావిలాసమే దేవీనవరాత్రులలో వివిధ మూర్తులతో సంకేతింపబడి మన చేత పూజించబడుతూంది. ఇది దేవీ నవరాత్రుల హృదయం.

ఇదే కథ మనలో ప్రతి ఒక్కరి హృదయంలోనూ, జీవితంలోనూ నిత్యమూ జరుగుతుంది. మనస్సే జగన్మాత. ఇంద్రియాలలోంచి బహిర్ముఖంగా పనిచేసి, యింద్రియానుభూతులను సేకరించి సుఖదు:ఖ మిశ్రమమైన జగదనుభూతినీ, అందులో మన వ్యక్తిగతమైన ఉనికినీ గూడ కల్పించి అనుభవిస్తుంది. ఇలా మనలో మనస్సుగా పనిచేసే యీ శక్తికి గల సామర్థ్యాలన్నీ ఒక వంక ధర్మ సూత్రాలను పాటిస్తూ జీవితాన్ని సార్థకం చేసుకొనేయత్నం చేస్తూంటే మనలోని అంత:శత్రువులను నశింపచేసే ఆయుధాలుగా ఉపయోగ పడతాయి. అలాగాక మనలోని అసుర, రాక్షస గుణాలను మనం ఆశ్రయిస్తే మనలను వ్యక్తిగతంగానూ, సామాజికంగానూ నశింపచేసే ఆయుధాలు గూడ ఆశక్తులే. ఉదాహరణకు మనలో కోరిక వుంటుంది. ఇది జ్ఞానాన్ని, భక్తినీ, ప్రేమనూ కోరడంగా పరిణమించినపుడు మనలను వ్యక్తిగతంగాను, సామాజికంగానూ కాపాడుతుంది. అలాగాకుంటే

మన మధ్య పోటీకి, ద్వేషానికి, పరస్పరం నశింపచేసుకోడానికి ఉపకరిస్తుంది. మన మానసిక, శారీరక స్వస్థతనుగూడ తారుమారు చేస్తుంది. ఈ జగన్మాత యొక్క తత్వాన్ని గురించి, గుర్తుంచుకొని ఈ సూత్రం ప్రకారం నడచుకోవడమే ఆమెను ఆరాధించడమంటే. ఇలా చేయాలంటే వ్యవహారిక జీవితంలో మనస్సు ఏర్పరచుకొనే రాగద్వేషాది ద్వంద్వ భావాలనే సీమలనుల్లంఘించి, అందరి దేహాలనే ఆలయాలలోని ఒకే ఒక్కటిగా దైవత్వాన్ని గుర్తించి ఆరాధించి, అది గుర్తుంచుకొని పరస్పరం ప్రేమ భావాన్ని మరలా సుప్రతిష్టించుకొంటుండవలసినదే. అలా అందరమూ చేసినపుడు మన అందరి హృదయాలలోనూ ఉన్న పరబ్రహ్మ స్వరూపి, త్రిమూర్తియైన సాయినాధునికి సీమోల్లంఘనమవుతుంది. ఆయన పరిమిత దేహంతో ఎక్కడో ఒకచోట పరిమిత రూపంలో ఉన్నారన్న అజ్ఞానం తొలగి అందరిలోనూ ఆయననే చూచుకోగలగాలి. పారువేటలో ఊరిలోని దేవతల మూర్తులన్నిటినీ ఊరేగించి పురపొలిమేరలో ఒకచోట చేర్చి పూజించడమంటే గూడ వ్యావహారిక జీవితంలో మమకారాది సీమల్లో తగుల్గొన్న మన హృదయగత భగవత్తాత్వాన్ని పురపొలిమేరలకు తెచ్చి గుర్తించి పూజించి మరలా హృదయాలలో ప్రతిష్టించుకొనడమన్నమాట.

అదే తమ ముఖ్యమైన బోధ అని తెల్పడమే ఒక విజయదశమి సీమోల్లంఘనం చేసి వస్తున్న భక్తులతో సాయి భావపారవశ్యంతో" ఈనాడేనా సీమోల్లంఘనం!!" అని గర్జించి, ఆ ప్రకారమే కొద్ది సంవత్సరాలలో ఆనాడే దేహాన్ని త్యజించడమన్న సీమోల్లంఘనంచేయడంలోని అంతరార్థము. ఈ విజయదశమిలో పై తెలుసుకున్న రీతిని జగన్మాతయైన (ద్వారకమాయి) సాయిని ఆరాధించి, సీమోల్లంఘనం చేసుకొందాం! పారువేట చేసుకొందాము!!

---

## "సాయిబాబా" పాఠకులకు విజ్ఞప్తి

మీ ''సాయిబాబా''లో ''ద్వారకామాయి అనుభవమంటపం" పున: ప్రారంభం కానుంది!!! శ్రీ సాయినాథుని, శ్రీ సాయి మాస్టర్ కృపవలన, పారాయణ ఫలితంగానూ మీకు కలిగిన అనుభవాలను మీరు మాకు పంపిస్తే "ద్వారకామాయి అనుభవమంటపం" అనే శీర్షిక క్రింద నెలకు ఒకరి అనుభవం ప్రచురించబడుతుంది. మీరు అనుభవాలు పంపవలసిన చిరునామా –

" Editor, Sai Baba Monthly Magazine,
Sri Master Universal Sai Trust, M.M.Donka,
Ongole - 523 002 "

– "సాయిబాబా"

మరాఠి మూలం: శ్రీ హేమాద్పంతు
స్వేచ్ఛానువాదం: పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

# శ్రీ సాయి సచ్చరిత్ర

**July** సంచిక తరువాయి

## అధ్యాయము - 48

శ్రీ గణేశాయ నమః, శ్రీ సరస్వత్యై నమః, శ్రీ గురుభ్యోన్నమః శ్రీ కులదేవతాయై నమః,
శ్రీ సీతారామ చంద్రాభ్యాం నమః శ్రీ సద్గురు సాయినాథాయ నమః



శ్రోతలారా! ఈ అధ్యాయాన్ని ప్రారంభిస్తుండగా, ఒక శ్రోత యిలా అడిగాడు: 'శ్రీసాయి గురువా? లేక సద్గురువా?' అని. (1) అతని తృప్తికోసం సద్గురువు యొక్క లక్షణాలను క్లుప్తంగా చెబుతాను. సాయి సమర్థునిలో వున్న గుణాలను పోల్చి చూసుకొని ఆయన గురువో, లేక సద్గురువో తెలుసుకోవచ్చు. (2) వేదాధ్యయనము చేసేవారిని, శాస్త్రజ్ఞానమున్న వారిని, వేదాంత నిరూపణము చేసేవారినీ జ్ఞానులని, సద్గురువులనీ అనరు. (3) ప్రాణాయామం చేసేవారిని, శ్వాసను కుంభించేవారిని, తప్తముద్రాధారణ చేసేవారిని, పరబ్రహ్మతత్త్వాన్ని వ్యాఖ్యానించి శ్రోతల మనసులను రంజింపజేసేవారినీ సద్గురువులని అనరు. (4)కొందరు శాస్త్రానుసారం శిష్యులకు మంత్రోపదేశంచేసి, జపాదులు చేయమని ఆజ్ఞాపిస్తారు. పరమాత్మ తత్త్వనిరూపణను రసవత్తరంగా బోధించినప్పటికీ స్వానుభవం లేనివారికి జ్ఞానం లేకపోవడం వల్ల వారు సద్గురువులు కారు. (5,6) వేదాంత నిరూపణను శ్రద్ధగా విన్నప్పుడు తాత్కాలికంగా లౌకిక విషయాలపట్ల విరక్తి కలుగుతుంది. కానీ అనుభవజ్ఞానాన్నివ్వజాలదు. పరమాత్మ సాక్షాత్కారాన్ని పొందినవారే అట్టి అనుభవాన్ని యితరులకు యివ్వగలరు. (7) ఎవరికైతే వేదాది శాస్త్రజ్ఞానం సంపూర్ణంగా వుంటుందో, పూర్ణ ఆత్మానుభవం ఎవరైతే పొందివున్నారో, వారే శిష్యులకు అనుభవజ్ఞానాన్ని యివ్వగలరు. అట్టివారే సద్గురువులు. తనకే ఆత్మానుభవం లేనివారు శిష్యులకు ఏమి యివ్వగలరు? (8,9) శిష్యులచేత సేవచేయించుకోవాలనే తలంపు స్వప్నంలోగూడ ఎవరికైతే వుండదో, శిష్యుల శ్రేయస్సుకోసం తమ దేహాన్ని వినియోగించాలని ఎవరైతే కోరుకుంటారో వారినే సద్గురువులు అంటారు. (10) ఎవరైతే శిష్యుడంటే తక్కువవాడని, గురువు అంటే శ్రేష్ఠులలో శ్రేష్ఠుడన్న అహంభావంలేక శిష్యులకు శ్రేయస్సు చేకూరుస్తారో వారే సద్గురువులు. (11) శిష్యుడు గూడ పరబ్రహ్మస్వరూపియేనని ఎవరైతే భావిస్తారో, శిష్యులను పుత్రులవలె

ప్రేమిస్తారో, తన పోషణకై వారినుండి ఎవరైతే ఏమీ ఆశించరో, అట్టివారే ఈ జగత్తులో పరమశ్రేష్ఠులైన సద్గురువులు. (12) ఎవరైతే అందరినీ సమానదృష్టితో చూస్తారో అదే సద్గురువు యొక్క స్థానమని గ్రహించాలి. (13) ఈ విధంగా సద్గురువు యొక్క లక్షణాలను సంకలనంచేసి సంక్షిప్తంగా శ్రోతలకు విన్నవించుకుంటున్నాను. (14) సద్గురువైన సాయి దర్శనంతో సంతృప్తిచెందిన భాగ్యవంతులకు సద్గురు లక్షణాలను నేనింతకంటె ఏమని వర్ణించగలను? (15) జన్మజన్మల పుణ్యఫలంగా ఈ జన్మలో మనకు సద్గురుసాయి యొక్క చరణాలు లభించాయి. (16) యుక్తవయస్సులో గూడ ఆయన (సాయి) దేనినీ స్వీకరించేవారు గాదు. వారికి ధనంగాని, గృహంగానీ ఏమీలేవు. వారికి ఇతరములైన ఎటువంటి ఆధారమూ లేదు. వారివద్ద చిలిమ్, పొగాకు మాత్రమే వుండేవి. యుక్తవయస్సులో గూడ ఎంతో మనోనిగ్రహం కలిగివుండేవారు. (17) పద్దెనిమిది సంవత్సరాల యుక్తవయస్సులో గూడ ఆయన తన మనస్సును సంపూర్ణంగా జయించి, ఎప్పుడూ నిర్భయంగా ఏకాంతంలో ఆత్మానందంలో లీనమైవుండేవారు. (18) భక్తుల యొక్క నిర్మలమైన ప్రేమను చూసి, 'నేను భక్తపరాధీనుడను' అన్న ప్రతిజ్ఞను భక్తులకు స్పష్టంగా తెలియపరచేవిధంగా భక్తి ప్రేమ వున్నచోట ఆయన వుంటారు.

(19) జయ పరబ్రహ్మ సనాతనా! జయ దీనోద్ధారా! ప్రసన్నవదనా! జయ చైతన్యఘనా! భక్తాధీనా! నీకు జయము జయము. భక్తులకు తమ దర్శనాన్ని ప్రసాదించండి. (20) జయ జయ ద్వంద్వాతీతా, జయ జయ అవ్యక్తావ్యక్తా! సర్వసాక్షీ! జయ దీనోద్ధారా! భక్తి లేనివారు నిన్ను తెలుసుకోలేరు. (21) జయ జయ భవసంతాపహరణా! జయ జయ భవగజ విదారణా! జయ జయ ఆశ్రిత ప్రేమపూర్ణా! జయ జయ సంకటనిరసనా! సద్గురురాజా! నీకు జయము జయము. (22) మీరు వ్యక్తరూపాన్ని త్యజించి అవ్యక్తులైనప్పటికీ భక్తులకు శుభాన్ని ప్రసాదించే మీ కార్యం మాత్రం ఆగిపోలేదు. (23) మీరు శరీరధారులై వుండగా భక్తులకు ఎటువంటి అనుభవాలను ప్రసాదించేవారో యిప్పటికీ అటువంటి అనుభవాలనే భక్తులకు ప్రసాదిస్తున్నారు. (24) అజ్ఞానాంధకారాన్ని పారద్రోలడానికి, భక్తులను ఉద్ధరించడానికి నావంటి పామరుడిని నిమిత్తమాత్రునిగాజేసి సమర్థవంతమైన ఈ మీ పావనచరిత్రను ప్రకటింపజేస్తున్నారు. (25) భగవంతునిపట్ల విశ్వాసము, శ్రద్ధాభక్తులు – ఇవే భక్తుని హృదయమనే ప్రమిదలు. వాటిలో ప్రేమయనే చమురుపోసి వత్తిని వెలిగించినట్లయితే జ్ఞానమనే జ్యోతి ప్రకాశిస్తుంది. (26) ప్రేమలేని జ్ఞానం వ్యర్థం. దానివల్ల ప్రయోజనం ఏమున్నది? ప్రేమలేనిదే శాంతి లేదు. ప్రేమ అవిచ్ఛిన్నంగా వుండాలి. (27) ప్రేమ యొక్క మహిమను గూర్చి నేనెంతని వర్ణించను? ప్రేమముందు ఇతరములన్నీ తుచ్ఛములే. ప్రేమలేని శ్రవణముగాని, పఠనముగాని, నిష్ప్రయోజనములే. (28) ప్రేమ వున్నచోటే భక్తి వుంటుంది. వైరాగ్యము, శాంతిగూడ వుంటాయి. అక్కడే ముక్తి, సర్వసంపత్తీ వుంటాయి. (29) భక్తిభావం లేనిదే ప్రేమ ఉత్పన్నంగాదు. భక్తిభావమున్నచోటే ప్రేమ పూర్ణంగా వుంటుంది. భక్తి వున్నచోటే భగవంతుడుంటాడు. భవసాగరాన్ని దాటడానికి భక్తియే ప్రధానం. (30)

శ్రీ సాయిబాబా చరిత్ర అతి మధురమైనది. గంగాజలంవలె పరమ పవిత్రమైనది. హేమాద్పంతు కేవలం నిమిత్తమాత్రుడే! శ్రీ సాయియే ఈ పదరచన చేస్తున్నారు. (31) శ్రీ సాయి చరిత్రను చదివినవారు, వినినవారూ పవిత్రులవుతారు. వారి పాపపుణ్యాలు నశించిపోయి ముక్తులవుతారు. (32) ఈ చరిత్రను పఠించిన జిహ్వ, శ్రవణం చేసిన కర్ణములు ధన్యతపొందుతాయి. పరమ పవిత్రమైన ఈ సాయి చరిత్ర ధన్యము. (33) ఈ చరిత్రను చిత్తశుద్ధితో శ్రవణం చేసినవారికి సకల మనోరథాలు నెరవేరుతాయి. శ్రద్ధాభక్తులతో

ఈ చరిత్రను శ్రవణం చేసినవారికి సునాయాసంగా సాయి చరణాలయందు భక్తి కలుగుతుంది. (34) భక్తిభావంతో సాయి నామస్మరణ చేసినా, ఆయనను సేవించినా ఇంద్రియ నిగ్రహం కలిగి, వారు అవలీలగా భవసాగరాన్ని దాటగలరు. (35,36) చాతక పక్షులకు వర్షపుచినుకులవలె శ్రీ సాయి చరిత్ర భక్తులకు ప్రాణంవంటిది. శ్రోతలు శ్రవణంచేసిన బాబా లీలలను మననంచేసి సాయికృపకు పాత్రులుకావాలి. (37) సర్వావస్థలలోనూ సావధానంగా సాయి చరిత్రను శ్రవణంచేసిన భక్తులు కర్మబంధ విముక్తులవుతారు. (38)

'ఇంకా అసలు కథ ఎప్పుడు ప్రారంభమవుతుంది?' అని శ్రోతలకు సందేహం కలుగవచ్చు. కనుక ప్రస్తావనను ప్రారంభించి శ్రోతల ఆతురతను తొలగిస్తాను. (39) క్రిందటి అధ్యాయంలో శత్రుత్వము, హత్య, ఋణము – వీటిని తీర్చుకోవడానికి మళ్ళీ జన్మలెత్తి ఆ కర్మలను అనుభవించాలని చెప్పుకున్నాము. (40) జీవులకు తమ పూర్వజన్మల గురించి గుర్తువుండదు. కాని మహాత్ములు సర్వజ్ఞులు. తమ భక్తులు ఎక్కడ జన్మించారో అక్కడికి వెళ్ళి వాళ్ళను రక్షిస్తారు. (41) ఇప్పుడు అడుగడుగునా సాఫల్యత చేకూరుతుంది. (42) ఏ పనిని ప్రారంభించినా మొదట సద్గురు చరణాలను స్మరించి కర్మాచరణ శ్రద్ధతో చేస్తే సద్గురువు వారి చింతలను దూరంచేస్తారు. (43) 'నేను కర్మలను చేయువాడను మాత్రమే, ఫలితాన్నిచ్చేవారు సద్గురువే' అని ఎవరైతే దృఢవిశ్వాసం కలిగివుంటారో వారి కార్యం తప్పక నెరవేరుతుంది. (44) సద్గురువులు పైకి కఠినంగా కన్పించినా వారి అంతరంగంలో నిస్వార్థప్రేమ వుంటుంది. భక్తులు విశ్వాసము, ఓరిమి కలిగివుండాలి. వారు తప్పక శ్రేయస్సు చేకూరుస్తారు. (45) మహాత్ముల సాంగత్యం వలన శాపతాపాలు, కష్ట, స్వార్థ, మమకారాలు – అన్నీ నశించిపోతాయి. కనుక హృదయపూర్వకంగా మహాత్ముల చరణాలను ఆశ్రయించాలి. (46) నిరహంకారంతో సత్పురుషులను శరణాగతి చెందాలి. వినయవిధేయతలతో ప్రార్థనాపూర్వకంగా మహాత్ములను శరణువేడితే వారు మనకు చిత్తశాంతిని ప్రసాదిస్తారు. (47) అల్పజ్ఞానంతోనూ, అహంకారంతోనూ సత్పురుషుల వచనాలను సంశయించినవారికి హాని కలుగుతుంది. (48) విశ్వాసముంచినవారికి శుభం కలుగుతుంది. (49) ఇదే విషయాన్ని తెలియజేసే ఒక లీలను యిప్పుడు చెబుతాను. శ్రోతలు శ్రద్ధగా వినండి. శ్రోతలకు అమితానందం కలుగుతుంది. వక్తకు గూడ ఉత్సాహం కలుగుతుంది. (50)

– సశేషం

---

Continued from page 5..

ఏదిఏమయినా బాబా సీమోల్లంఘనం చేసారు. సాకారంగా ఆయన ఉన్నంత వరకూ భక్తులు ఆయన హిందువా, ముస్లిమా అన్న సీమ దాటేటట్లు లేరు. పరస్పర అసూయాద్వేషాలను మానేలా లేరు. అట్టి దుస్థితి నుండి మనలనుద్ధరించడానికే సాయి తమ దేహ సీమ దాటారు. అలాంటి విజయదశమినాడైనా మన హృదయాలు సీమోల్లంఘనం చేయగల్గితే 60 సంవత్సరాలు సాయి నిర్వర్తించిన నిరతాగ్ని హోత్రంలాంటి లీలాఘట్టానికి అర్హులము గాలేము. " తల్లికి తగిన బిడ్డలు కండి. మీ ధనాగారాలు నింపుకోండి. లేకుంటే మనమేమవుతాము? మట్టి మట్టిలో, గాలి గాలిలో కలిసిపోతాయి. ఇలాంటి అవకాశం మరలా రాదు" అంటూంది విజయదశమి!!!

# బాబా చిత్రపటం-3 (పూజ)

జై సాయి మాస్టర్

- శ్రీమతి వేదవతి

మనం నిత్యం బాబా అంతటా వున్నారనే గుర్తును నిలుపుకునేందుకు ఆలంబనగా బాబా చిత్రపటం ఇంట్లో పెట్టుకున్నాము. ఆయన మనలను ఇహపరాలలో జాగ్రత్తగా కాపాడాలని, ఆయన కృపకు పాత్రులుకావాలనీ - ఇది చాలా ముఖ్యమైన విషయమనీ మనందరికీ జీవితంలో ఎన్నోసార్లు తెలుస్తూవుంటుంది. ఆయనను ఆశ్రయించిన తరువాత అంతో ఇంతో మనకిది అనుభవంలోకి వచ్చింది. అందుకే మనకు ఆయనంటే ఇష్టం కలిగింది.

అయితే మనం (ముందు సంచికలలో చర్చించినట్లు) ఎన్ని చిత్రపటాలు ఇంటినిండా పెట్టుకున్నా, ప్రతిరోజూ వాటిని శుభ్రంచేసి నివేదనలు ఇచ్చినా, భావం నిలుపుకునేందుకు ఆలంబనగా చరిత్ర పారాయణ చేస్తూవున్నా క్రమంగా ఇవన్నీ యాంత్రికంగా మారే ప్రమాదముంది. అందుకని రోజులో కొద్దిసేపైనా ఆయనకు సేవచేసి, ఆయన గుణగణాలను కీర్తించుకోవడం ద్వారా మన భావాన్ని సరిచేసుకుని, శ్రద్ధను నిలుపుకునేందుకు ప్రయత్నించాలి - ఎందుకంటే మన శ్రద్ధనుబట్టే ఫలితమొస్తుంది. కనుక అలాచేయడానికి మనకు వున్న నిత్యక్రమమే పూజ.

బాబా తన చిత్రపటంరూపంలో మన ఇంట్లో వున్నారు. అది నిర్వివాదాంశం. అయితే మనలోని లోపాలవలననే ఈ సత్యం మనకు అనుభవంలోకి రాలేదు.

మరి అంతటి సద్గురువు మన ఇంట్లో నిత్యనివాసం చేస్తూవుంటే ఆయనకు మనం చేయవలసిన సేవలేమిటి? ఆయనను ఆహ్వానించి ఆసనంమీద కూర్చోబెట్టి, కాళ్ళుకడిగి, చేతులు కడుగుకునేందుకు నీరిచ్చి, మంచినీళ్ళిచ్చి, స్నానం చేయించి, మంచి వస్త్రాలతోనూ, గంధంతోనూ, యజ్ఞోపవీతంతోనూ, పూలతోనూ అలంకరించి, ఆయన గుణాలను కీర్తిస్తూ ఆయనకు పాదపూజచేసి, అగరొత్తులు వెలిగించి, నైవేద్యమిచ్చి, తాంబూలమిచ్చి, హారతిచ్చి, మన ఇహపరాలకు నీవే దిక్కని ప్రార్థించి, అందరిలోనూ ఆయనే వున్నారనే గుర్తును మనకు ఆరోజు తారసిల్లే వ్యక్తులు, పరిస్థితులలో గుర్తుండేలా చేయమని ప్రార్థిస్తూ, 'నాకు నీవే శరణు, వేరు దిక్కులేదు' అని ఆత్మసమర్పణ చేసుకుని, ఆయనను గొడుగు, విసనకర్ర, గీతాలాపన, నృత్యం మొ॥నవాటితో సేవించడమే పూజావిధానము.

ప్రతిరోజూ పూజచేస్తూ శ్రద్ధగా ఇలా ఆయనను సేవించుకుంటుంటే మన ఇల్లు ఆయన దర్బారులా భావన కలుగుతుంది. మనమాయన సేవకులమేనని, మన దినచర్య ఆయన సేవేనని క్రమంగా మనకు తెలియడం మొదలౌతుంది. ఇక ఆ ఇంట్లో చేసిన ప్రతి సేవా ఆయన సేవగా మారిపోతుంది. అప్పుడు మనిల్లే ద్వారకామాయి.

మనమీపూజ చేసేటప్పుడు అనేక వస్తువులను పూజలో వుపయోగిస్తాం. మనమాయనను పసుపు కుంకుమలతోను, గంధంతోనూ పూలతోను అలంకరిస్తాం. ఇవి సహజంగా ప్రకృతినుంచి లభించేవి. వీటిలో ఎటువంటి అసహజత్వము, కృత్రిమత, అనారోగ్యకరమైనవేవీ లేవు. ఆయనను సేవించుకునేటప్పుడు నిర్మలమైన, సహజమైన మనస్సుతోను, ప్రేమతోనూ సేవించుకోవాలని, ఈ లక్షణాలను మన జీవితంలోకూడా అలవరచుకోవాలనీ అవి మనకు గుర్తుచేస్తాయి. అటువంటి మనస్సు ఇటు మనకు, మన సాటివారికి, మన ఇంటికీ శుభవాసనలను, ప్రశాంతతను, మానసిక, శారీరక ఆరోగ్యాన్ని, ఆనందాన్ని కలుగజేస్తుందని కూడా అవి మనకు తెలుపుతాయి.

కుంకుమ: కుంకుమ ఒక రాయినుంచి వస్తుంది. కుంకుమరాళ్ళను తీసుకువచ్చి పొడిగొడితే మనకు కుంకుమ లభిస్తుంది. అప్పుడే దానికి పూజకు, పవిత్రమైన

సందర్భాలలోనూ వుపయోగపడే అర్హతవస్తుంది. కుంకుమరాయిలాగా కఠినంగావుండే మన అహంకారాన్ని, ఇతర దుర్గుణాలనూ ఆయనపట్ల భక్తిఅనే ఆలంబనతో నిర్వీర్యం చేసి ఆయన సేవలో మనల్ని మనం అర్పించుకునేందుకు అర్హత సంపాదించుకోవడానికి సూచనగా నిలుస్తుంది కుంకుమ.

కుంకుమ ఎర్రగా వుంటుంది-రక్తంలాగే. మానవులమందరమూ ఒకే భగవంతుడిచేత ఆయన బిడ్డలుగా సృష్టింపబడ్డామని, కాబట్టి అందరమూ ఒకే రక్తసంబంధీకులమనీ కుంకుమ మనకు గుర్తుచేస్తుంది. ఒకే తల్లినుంచి పుట్టిన పిల్లలలాగా పరస్పర సహకారంతోను, ప్రేమభావంతోనూ మెలగాలని కుంకుమ మనకు తెలియజేస్తుంది. అంతేకాదు, వివిధ మానవుల భావాలు, రూపాలు, భాషలు వేరైనా అందరిలోనూ రక్తం ఎర్రగానే వున్నట్లు, ఒకే భగవంతుడు అందరిలోనూ వున్నాడని మనకు కుంకుమ గుర్తుచేస్తుంది. ఈ భావాన్ని ఎప్పటికప్పుడు బలపరచుకొని మన ప్రవర్తనను మలచుకునేందుకు ఆలంబనగానే మనం దినచర్యలోని ప్రతి పవిత్రకార్యంలోనూ కుంకుమను ధరించడం, కుంకుమతో ఇష్టదేవతను అలంకరించడం, కుంకుమతో పూజించడం చేస్తుంటాము.

హిందూ సాంప్రదాయంలో సుమంగళులైన స్త్రీలు తప్పక కుంకుమ ధరించాలని చెప్పబడివుంది. వివాహిత అయిన స్త్రీ సర్వమానవాళినీ తన రక్తంపంచుకుని పుట్టిన బిడ్డలలాగా ఆదరిస్తానని, ప్రేమిస్తాననీ ప్రతిజ్ఞ పూనడమే ఈ సాంప్రదాయం యొక్క పరమార్థం. అలాగే స్త్రీలను తమ మాతృస్వరూపులుగా గౌరవించాలని కుంకుమ ధరించిన ముఖం చూడగానే అందరికీ గుర్తురావాలి. అందుకే పరస్త్రీ అంటే తల్లితో సమానమని మన శాస్త్రాలన్నీ చెప్పాయి.

బాబాను కుంకుమతో అలంకరించేటప్పుడు 'ఆయనే మనందరికీ తల్లి, మనమందరం ఆయన బిడ్డలమే' అని భావిస్తూ ఆయనను అలంకరించాలి.

పసుపు: పసుపు ఆరోగ్యానికి చిహ్నం. అది స్వతహాగా ఎంతో ఆరోగ్యకరమైన ఔషధం. సాంప్రదాయకంగా స్త్రీలు పసుపు పాదాలకు పూసుకునే ఆచారం భారతదేశంలో వుంది. అహంకార మమకారాది బలహీనతలకు లొంగకుండా ఆరోగ్యకరమైన నడవడికతో వుంటానని దీక్షపూనడమే కాళ్ళకు పసుపు పూసుకోవడానికి చిహ్నం. ఇది సుమంగుళైన స్త్రీలకు ఒక శుభకరమైన ఆచారంగా చెప్పబడివుంది. గృహస్థాశ్రమంలో వాళ్ళు అందరినీ తమ బిడ్డలుగా ఆదరిస్తానని దీక్షపూనినపుడు, అందులో అహంకారం, మమకారం వంటివాటికి లోనుకాకుండా ప్రవర్తిస్తానని దీక్షపూనడమే ఈ ఆచారం యొక్క ఉద్దేశ్యం.

అలాగే పూజలో పసుపు వాడడం మానసికంగానూ, శారిరకంగానూ ఆరోగ్యకరమైన ఆలోచనలతోనూ, కోరికలతోనూ భగవంతుడిని పూజిస్తానని, తనకూ, సమాజానికీ హానికరమైన కోరికలను వహించననీ మరల మరల గుర్తుకుతెచ్చుకోవడమే ఈ పద్ధతికి మూలం.

గంధం: గంధపు చెక్కను నీళ్ళుపోసి అరగదీస్తే గంధం వస్తుంది. అలాగే సాధన ద్వారా మంచి సంస్కారాలను పెంపొందింపచేసుకొంటూ భగవంతుని సేవించాలని తెలుపుతుంది మనకు గంధం. అంతేగాక గురుభక్తి అనే నీళ్ళు కలపనిదే ఎంత సాధనచేసినా వ్యర్థమని, భగవంతుని కృప లభించదనీ తెలుపుతుంది గంధం.

పూలు: పూలు ఎక్కడో చెట్టుమీదపుడతాయి. వాటి సత్కర్మ ఫలితంగా భగవంతుడి పాదాలచెంత చేరతాయి. అలాగే పూలు రకరకాలు - మనందరిలాగే. ఎక్కడెక్కడోపుట్టిన మనం పూర్వపుణ్యంచేత ఆయన పాదాలచెంత చేరామని, ఆయన సేవలో జీవితాన్ని సార్థకం చేసుకోవాలనీ పూలు మనకు చెబుతాయి.

పూలమాల: "పూలమాలలోని దారంలాగా సాయి సర్వగతుడు" - సాయిలీలామృతం.

ఈ సూత్రాన్ని గుర్తుంచుకొని పూజ చేయడానికి ఆలంబనగా మనం పూలమాలను భగవంతునికి అలంకరిస్తాము. అంటే ఒకే భగవంతుడు అందరిలోనూ, అంతటా నిండివున్నాడని గుర్తుంచుకోవడానికి ఎల్లప్పుడూ ప్రయత్నిస్తూ వుండాలి.

అంతేకాకుండా పూలలాగా ఎక్కడెక్కడో పుట్టిన మనం గురుభక్తి అనే దారంతో గురుబంధువులమయ్యాము. అలా కలిసిన మనమందరమూ సత్సంగము, భజన మొ॥న సమిష్టి సాధనలతోను, పరస్పర సహకారంతోనూ ఆయన సేవలో జీవితం గడిపి ధన్యులమవ్వాలని గుర్తుచేస్తుంది మనకు పూలమాల.

ధూపం: మన వ్యక్తిత్వానికి సంకేతం అగరొత్తి. రకరకాల వ్యక్తిత్వాలతో కూడిన మన జీవితాలు గురుభక్తి అనే అగ్నిచేత ప్రభావితమైనప్పుడు, దాని ఆలంబనతో మన దుష్టసంస్కారాలు బూడిదలా నిస్సారంగామారి మన వ్యక్తిత్వాలు సువాసనలుగా మారిపోతాయి. అట్టి సువాసనతోకూడిన మన అస్తిత్వం భగవంతుని సేవలో తాదాత్మ్యంచెందాలని చెబుతుంది ధూపం.

దీపం: దీపంలోని నూనె ప్రారబ్ధానికి సంకేతం. ఐదు గోపురాలతోకూడిన దీపపుకుంది పంచభూతాలతో చేయబడిన మనశరీరానికి సంకేతం. ఆ నూనెకు ఆలంబన ఈ దీపపుకుంది - అలాగే మన ప్రారబ్ధం అనుభవించడానికి ఆలంబనగా ఏర్పడినదే మన శరీరం. అలాగే ఐదుగోపురాలు పంచేంద్రియాలకు సంకేతం. వాటిలో మనం వేసే ఒత్తులు, ఈ ఇంద్రియానుభవాలకు లోనైన మన మనస్సుకు సంకేతాలు. అన్ని ఇంద్రియాలనూ గురుభక్తి అనే నిప్పుకు లోనుచేస్తే ప్రారబ్ధం నశించిపోతుంది. అలా మనం భగవంతుని చేరగలం.

'నా శరీరాన్ని, మనస్సునూ నీ సేవకే అంకితం చేసి నా ప్రారబ్ధాన్ని నశింపచేసుకుంటాను' అనే భావానికి సంకేతంగా రెండు ఒత్తులు, 'ప్రారబ్ధం నశింపచేసుకోవడానికి నీయందు భక్తి ఒక్కటే చాలు!' అనే భావానికి సంకేతంగా ఒక ఒత్తితో దీపము నిలుస్తాయి.

కర్పూరం: కర్పూరం స్వచ్ఛతకు సంకేతం. స్వచ్ఛమైన కర్పూరానికి నిప్పు తోడవగానే అది దాని ఉనికిని కోల్పోతుంది. అలాగే మన మలినమైన సంస్కారాలనుండి స్వచ్ఛులమైన తర్వాత మాత్రమే మనం గురుభక్తి ద్వారా తరించగలమని సూచిస్తుంది నీరాజనం.

అక్షింతలు: అక్షింతలలోని బియ్యం జీవితానుభవాలకు, నూనె ప్రారబ్ధానికి, పసుపు ఆరోగ్యానికి సంకేతాలు. ప్రారబ్ధంచేత మలినమైన మన జీవితానుభవాలు గురుభక్తివల్ల మానసికము, శారీరకమూ అయిన ఆరోగ్యంతో కూడినపుడే మన జీవితాలు భగవంతుని సేవలో తరిస్తాయని తెలుపుతాయి అక్షింతలు.

ఇలా మనం వాడే పూజాద్రవ్యాలకు అనేకమైన వేదాంతిక అర్థాలు వున్నాయి. అలాగే వీటికి యోగపరమైన ప్రయోజనాలు, సాధకుని సాధనావిధానాన్నిబట్టి అర్థాలు ఎన్నో వున్నాయి. అయితే మాస్టర్‌గారు చెప్పినట్లు మన భావాన్నిబట్టి మనకు ఫలితమొస్తుంది - కాబట్టి పై చెప్పినవాటికంటే మంచిభావాలు మనకు తోచినట్లైతే ఆ భావాలనుబట్టి మనం పూజచేసుకోవచ్చు. వీటికితోడు మాస్టరుగారు 'సాయినాథ పూజ' గ్రంథంలో చెప్పిన వివరణ మనస్సులో వుంచుకొని పూజ చేసినట్లయితే పూజ యాంత్రికమవకుండా నిత్యనూతనంగా సాగుతుంది.

ప్రతిరోజూ అంత వివరంగా పూజ చేసుకోలేనప్పుడు సెలవుదినాలలో భావాన్ని నిలుపుకుంటూ, వివరణ చదువుకుంటూ చేస్తే కొన్నిరోజులలో రోజూ చేసుకునేటప్పుడు కూడా ఆ అవగాహన మనకు అవలీలగా స్ఫురిస్తుంది. అప్పుడు పూజ ఒక తప్పని పనిగాకాక ఒక అద్భుతమైన అనుభవంగా సాగుతుంది. అపుడు పూజ సార్థకమౌతుంది.

భావరహితమైన పూజవలన మనకు ఏ ప్రయోజనము, ఫలితమూ వుండదు. “బాబాకు భావమే ప్రధానం' అని మాస్టరుగారు శ్రీ సాయిలీలామృతంలో వ్రాశారు. అంటే భావం ఎంత తీవ్రంగాను, ఉన్నతంగానూ వుంటే ఫలితం కూడా అంత ఉన్నతంగా వుంటున్నదన్నమాట. అందుకే మానసిక పూజ అన్నింటికంటే శ్రేష్ఠమని శ్రీ

Continued on page 20...

# వార్తాలాపము

(సీరియల్)

## మననము

శ్రవణము చేసిన అద్వితీయ బ్రహ్మము అను అర్థమును శ్రుత్యనుకూలములగు అనుమానాది యుక్తుల ద్వారా చింతించుట మననము. ఆవు మేతమేసిన తరువాత ఏ చెట్టు నీడనైన కూర్చుని నెమరువేసి తృప్తిని పొందును. అటులనే వేదాంత శాస్త్రమును శ్రవణముచేసిన తరువాత ఏకాంతమున కూర్చొని దానిని మననముచేయుటచే దృఢముగా బోధపడును.

## పంచదశియందలి మనన లక్షణము

యుక్త్యా సంభావితతత్త్వానుసంధానం మననం తు తత్।

"యుక్తులద్వారా గురువువద్ద శ్రవణముచేసిన అభిప్రాయము సంభవము అను నిశ్చయమును పొందుట మననము".

శ్వేతకేతునకు అతని తండ్రి "తత్త్వమసి" అని తొమ్మిదిమారులు ఉపదేశించెను. "జీవుడు బ్రహ్మము" అను జ్ఞానము మననాభావమున వ్యవహారపరుడును, అనధికారియునగు జీవునకు కలుగదు. కావున జీవ బ్రహ్మైక్యజ్ఞానమును సంపాదించుటకు సారభూతమగు "తత్త్వమసి" యందలి 'తత్, త్వమ్' శబ్దముల శబ్దార్థమునందు భాగత్యాగలక్షణద్వారా జీవబ్రహ్మాభేదమును నిశ్చయించవలెను.

"తత్" శబ్దమునకు వాచ్యార్థము ఈశ్వరుడు, సర్వజ్ఞత్వాది ధర్మవిశిష్టుడు.

"త్వమ్" శబ్దమునకు వాచ్యార్థము జీవుడు, అల్పజ్ఞత్వాది ధర్మవిశిష్టుడు.

సర్వజ్ఞత్వ, అల్పజ్ఞత్వములు రెండునూ విరుద్ధ ధర్మములు. కాని ఉపనిషదాదులను అభ్యసించినవారికి ఆ ధర్మములు ఉపాధిమాత్రములేననియు, ఉపహిత జీవచైతన్యమును, ఈశ్వరచైతన్యమునూ ఒకే చిదేకరసమగు బ్రహ్మము అని తెలియును. ఇట్లు 'జీవుడు బ్రహ్మము' అను నిశ్చయమునకు సాధకుడు వచ్చును. అంతేకాదు. ఒకే ఆకాశము ఘటము, పటము అను వేరు వేరు ఉపాధులను పొందుటచే ఘటాకాశ పటాకాశాది రూపమున స్థూలముగా ప్రతీతమగును.

అటులనే ఒకే బ్రహ్మము అను చైతన్యము అవిద్య లేక మాయయొక్క వేరు వేరు ఉపాధుల ద్వారా జీవరూపమున అల్పజ్ఞుడుగాను, ఈశ్వరరూపమున సర్వజ్ఞుడుగాను ప్రతీతుడగును. ఈ యుక్తులు నేను "శుద్ధస్వరూపుడను" అను అభేదనిశ్చయమును చేయుటకు ఉపకరించును. అభేదనిశ్చయమునకు ఇట్టి యుక్తులను ఉపయోగించుట మననము.

ఈ కారణముచే ఏ యుక్తులద్వారా భేదజ్ఞానము పెరుగునో అవి కుతర్కము అనిపించుకొనును. మననము అనిపించుకొనదు.

బ్రహ్మవిద్యను సంపాదించవలెనను కోరికకలవానియందు వినయము, మాహాత్మ్యజ్ఞానము, శ్రద్ధ, బ్రహ్మచర్యాదులును వుండవలెను. ఆ గుణములు లేకపోయినచో బ్రహ్మవిద్యను సంపాదించుటకు ప్రయత్నించినవారు కుతర్కమునకు లోనగుదురు. మననమునందు యుక్తులను ఉపయోగించవలెను. కాని విరోచనుడు ఉపయోగించినట్టివి మాత్రము కారాదు.

# నిదిధ్యాస

విజాతీయ వృత్తులను తిరస్కరించుటతోబాటు సజాతీయ వృత్తులను ప్రవహింపజేయుట నిదిధ్యాసనము.

"నేను సత్తును, చిత్తును, ఆనందమును, కూటస్థుడను, అక్రియుడను, అజరుడను, అమరుడను, పూర్ణుడను, నిత్యుడను, శుద్ధుడను, బుద్ధుడను, ముక్తస్వరూపుడునగు ఆత్మను". - ఇట్టి జ్ఞానరూపమగు ప్రవాహము సజాతీయవృత్తి ప్రవాహము.

"నేను బ్రాహ్మణాది నాలుగు వర్ణములకును చెందినవాడనుకాను. బ్రహ్మచర్యాది నాలుగు ఆశ్రమములును నేను కాదు. పురుష, స్త్రీ, బాలాది భేదములు నావికావు" - ఇట్టి జ్ఞానరూపమగు వృత్తులప్రవాహము విజాతీయ ప్రత్యయ తిరస్కారము. నిధిధ్యాసనము జ్ఞానమునకు సాక్షాత్కారణము. అది పరిపాకమును పొందనిదే అవిద్యాక్షయము జరుగదు.

'నిధిధ్యాసనశూన్యస్య వాస్త్యవిద్యాపరిక్షయః।

నిదిధ్యాసనరహితుడయినవానికి అవిద్య నశించదు. ఈ రోజులలో శ్రవణ, మననములు చేయుట కలదు. గురువువద్ద శాస్త్రశ్రవణము చేయుదురు. మననముతో ఎల్లప్పుడును శాస్త్రావలోకనముచేసి కంఠస్థముకూడ చేయుదురు. కాని ఏకాంతమున కూర్చొని ఎవడును నిదిధ్యాసనము చేయుటలేదు. నిదిధ్యాసనము చేయనంతవరకు బ్రహ్మసాక్షాత్కారము కలుగదు.

శ్రుతేః శతగుణం విద్యాన్మననం మననాదపి ।
నిదిధ్యాసం లక్షగుణం అనన్తం నిర్వికల్పకమ్ ॥

(వివేక చూడామణి)

"వేదాంత శ్రవణముకంటె బ్రహ్మముయొక్క మననము నూరురెట్లు గొప్పది. మననముకంటెను బ్రహ్మముయొక్క దృఢధ్యానము లక్షరెట్లు ఫలముకలది. నిర్వకల్పసమాధి అంతకంటె అనంతమగు ఫలమును ఇచ్చును". నిర్వికల్పసమాధిద్వారా జ్ఞానము కలుగును. జ్ఞానముచే అన్నిరకములగు దుఃఖములును నివృత్తిచెందును. కావుననే శ్రుతి చెప్పుచున్నది.

"ఆత్మా వారే ద్రష్టవ్యః"

ఓ మైత్రేయీ, ఆత్మ దర్శించదగినది.

వైద్య:- చాలారోజులనుండి నేను వాక్సంయమనము కొంచెముగా వుంచుకొనుచున్నాను. చిత్తమును అంతర్ముఖముగా చేసికొనుటకు ప్రయత్నించుచున్నాను. అయినను ఇంతవరకును చిత్తము అంతర్ముఖము అగుటలేదు.

స్వా. ప్ర.:- చాలమంచిది. ఇప్పుడు చిత్తము అంతర్ముఖము కాకపోయినను భయములేదు. నీవు మార్గమున వున్నావు. నీ అభ్యాసానుక్రమము శ్రుతిని అనుసరించి వున్నది. ఆ విధముగా సతతము అభ్యసించినచో చిత్తము అంతర్ముఖము అగును.

యచ్ఛేద్వాఙ్మనసి ప్రాజ్ఞస్తద్యచ్ఛేత్ జ్ఞానమాత్మని ।
జ్ఞానమాత్మని మహతి నియచ్ఛేత్తద్యచ్ఛేచ్ఛాన్త ఆత్మని ॥

"వివేకియగు నరుడు వాణిని మనస్సునందు లయము చేయవలెను. ఆ మనస్సును ప్రకాశరూపమగు బుద్ధియందు లయము చేయవలెను. బుద్ధిని మహత్స్వరూపమగు ఆత్మయందు లయముచేయవలెను. దానిని శాంతమగు ఆత్మయందు లయము చేయవలెను".

లౌకికములును, వైదికములును అగు శబ్దములను ఉచ్చరించుటకు హేతువులగు వాగాది ఇంద్రియములను అధికారియగు పురుషుడు మనస్సునందు లయముచేయవలెను. వాగాది ఇంద్రియముల వ్యాపారములను అన్నిటిని త్యజించి మనోవ్యాపారమునందు మాత్రమే తాను స్థితిని పొందవలెను. వాక్కును జయించిన తరువాత సంకల్పవికల్పాత్మకమగు మనస్సును విజ్ఞానమునందు-బుద్ధియందు లయము చేయవలెను. "నేను మనుష్యుడను, "నేను బ్రాహ్మణుడను" అను విశేషాహంకారమునకు పేరు జ్ఞానాత్మ". అధికారి ఈ జ్ఞానాత్మరూపమున స్థితిని పొందవలెను. అనంతరము విశేషాహంకారమును మహత్స్వరూపమున లయముచేయవలెను. అనగా నేను మనుష్యరూపమున వున్నాను, బ్రాహ్మణరూపమున వున్నాను అనువిధమున అహంకారమును త్యజించి అస్మితారూపమున శేషించి వుండవలెను.

అహంకారము యొక్క సూక్ష్మావస్థయే "అస్మిత". ఈ అస్మితయే మహత్తత్త్వము. ఇదియే సూక్ష్మాహంకారము అనికూడ చెప్పబడును.

అస్మితారూపమగు మహదాత్మను ఏకరస చైతన్యరూపమగు శాంత ఆత్మయందు లయము చేయవలెను. అస్మితను మాత్రము త్యజించి కేవల చైతన్యరూపముతో మాత్రమే వుండవలెను.

ఈ ప్రకారము చైతన్యమగు ఆత్మయందు చిత్తమును అన్నివిధముల లయముచేయుట నిరోధసమాధి.

1. వాక్ నిరోధము, 2. నిర్మనస్కత్వము, 3. అహంకారరాహిత్యము, 4. మహత్తత్త్వరాహిత్యము అనునవి నాలుగు దశలు.

ఇచ్చట అహంకార రాహిత్యము అనగా విశేషాహంకార రాహిత్యము, మహత్తత్త్వరాహిత్యము అనగా సామాన్య అహంకార రాహిత్యము అని తెలిసికొనవలెను.

1. గోవులు, అశ్వములు మొదలగు జంతువులయందు మానవునికి వున్నట్లు వాగింద్రియము లేదు. అటులనే వాగింద్రియము వున్నను దాని వ్యాపారములు స్వాభావికముగా అభావమును పొందుట వాక్‌నిరోధము అను మొదటి దశ.

2. పుట్టుకనుండియు మూగయును, చెముడునుకల బాలురయందు మనోవ్యాపారములు స్వాభావికముగా అభావమును పొందును. అటులనే వాక్, శ్రోత్రాదులు, మనస్సు వుండినను మానవుని మనోవ్యాపారములు స్వాభావికముగా అభావమును పొందుట నిర్మనస్కత్వము అను రెండవదశ.

3. తంద్రావస్థయందు అనగా నిద్రారంభమునందు అహంకారము వుండును. కాని విశేషాహంకారము వుండదు. ఏలనన ఆ స్థితియందు "నేను వున్నాను" అను ప్రతీతి కలుగును. కాని నేను ఫలానావాని కుమారుడను, ఫలానాజాతికి చెందినవాడను-ఇటువంటి విశేషప్రతీతి కలుగదు. తంద్రావస్థయందు వున్నంతవరకు సామాన్య అహంకారమే యుండును. అటులనే తంద్రావస్థను పొందకపోయినను విశేషాహంకారమును పొందకపోయినచో అహంకారరాహిత్యము అను మూడవదశ అని తెలిసికొనవలెను.

4. సుషుప్తియందు సామాన్యాహంకారము వుండదు. ఏలనన ఆ సమయమున "నేను" అను ప్రతీతికూడ కలుగదు. అటులనే సుషుప్తి లేకపోయినను కలుగు సామాన్యాహంకారనివృత్తి మహత్తత్త్వరాహిత్యమను నాలుగవదశ.

వైద్య:- నేను పూర్వము కొంచెము ఎక్కువగానే అభ్యాసము చేసెడివాడను. అంతలో యువకుడైన నా కుమారుడు చనిపోవుటచే పుత్రశోకముచే అభ్యాసమునకు అంతరాయము కలిగినది. నేను పుత్రశోకమను లోతగు నూతిలో పడిపోతిని. ఇప్పుడు ఇంకా కొంచెము నయమే.

- సశేషం

OM SADGURU SRI SAINAADHAYA

E. Bharadwaja M.A.,
DWARAKAMAYI
P.O. VIDYANAGAR-524413
Nellore Dt. (A.P.)

Date 23/10

[illegible]

# శ్రీ భరద్వాజ లేఖామృతము

*Om Sadguru Sri Sainaadaya*

Date : 23/10

E. Bharadwaja, M.A.
Dwarakamayi
P.O. : Vidyanagar - 524413
Nellore Dt. (A.P.)

చి॥ శ్రీదేవికి ఆశీస్సులు,

జాబు చేరినది, మేము 15 శనివారం ఇక్కడకు క్షేమంగా చేరాము. సత్యం ఇంకొద్ది రోజులు శిరిడీలో వుండి వస్తానన్నాడు. రాగానే జాబు చూపుతాము. బాబా చరిత్ర హిందీలో వ్రాసేయత్నం చెయ్యి. ఇదివరకటి ఆలస్యం గురించి బాధలేదు మనలో "పరిమితమైన నేను" అనేది లేనప్పుడు ఎవరిలోనూ లేదు. ఆ విషయం జ్ఞాపకం చేసుకుంటూ ఉన్నదన్న భావాన్ని పక్కకు నెట్టేస్తుంటే ఎప్పుడూ నా సమక్షంలో ఉన్నట్లే. బాధ అవసరం లేదు. మందిరం పని బాగానే జరుగుతున్నది. అమ్మ జపసంఖ్య తగ్గించి ఆ జప మంత్రార్థమైన భావాన్ని చేస్తున్నా చాలు; ఏ మహనీయుని మనస్సులో ఈ జగత్తంతా భావానయో అదే దైవమన్న భావన నిలుపుతే చాలు. పైన నీకు వ్రాసిన పదమే ఆమెకూ వినియోగపడుతుంది. బాబా సన్నిధిలో కూర్చున్నామన్న భావన చాలు. ఆ బాధలతో కూడిన శరీరం తను కాదు అని 'నేననేది ఏది?' అన్న వ్యాసంలోలాగ చింతన చేస్తుంటే రుగ్మతల ప్రభావం తగ్గుతుంది. అమ్మ పంపిన వత్తులు శ్రీ శివనేశన్ గార్కి అందించాము. మీ అందరి గురించి ప్రదక్షిణలు చేసి కొబ్బరికాయలు ధునిలో వేశాము. కనుక మీరు కొంచెం జాగ్రత్తగా ఆయన ధ్యాసలో వుంటే ఎంతో మేలు కలుగుతుంది. అనసూయకు, నీకు ఆశీస్సులు. అనసూయ పరీక్షలెలా వ్రాసింది? ఇంట్లో అందరి రూపాలలో బాబాను చూస్తూ గోలను పట్టించుకోని స్థితిలో నిలువ యత్నించు. త్వరలో వారేదారిలోకి వస్తారు. అలాకాక వారిని వారుగానే గుర్తించిన కొద్దీ వారి సంచలనం పెరగడం, అంతా బాబా అన్న నీ ధ్యానం పలుచబడడం జరుగుతుంది. అమ్మకు నమస్కారాలు. విశాఖలో నాన్నగారు బాగున్నారు. మంగ మందు తీసుకొంటూంది. బాబా యిచ్చిన రూపాయను పూజిస్తున్నాము. ఇంగ్లీషులో శ్రీసాయి లీలామృతము ముద్రణ పూర్తియగుతున్నది. నవాబుగారు చదివేటట్లయితే ఒక ప్రతి నివ్వవచ్చని అన్నయ్యతో చెప్పవలసినది. పాప హారతులు, పాటలు పాడుతుంది.

ఇట్లు,
ఆశీస్సులతో,
**భరద్వాజ**

# మనము అసలు ఎందుకు చదువుకోవాలి!

- ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

జ్ఞానం గూడ జ్యోతిలా అన్ని వస్తువులనూ వెల్గించి మనకు వాటిగురించిన అవగాహన కల్గేలా చేస్తుంది. అనుభవాన్ని ప్రసాదిస్తుంది. దాని ఉనికి తెలియడానికి మాత్రం వేరొక వెలుగు అవసరంలేదు. అలాటిదే ఆత్మజ్ఞానం. ఒక దీపాన్ని సులభంగా వెలిగించేందుకు ఉపాయమొక్కటే - వెలుగుతున్న మరొక జ్యోతికి యీ దీపంలోని వత్తిని ఆనించి వుంచాలి. మొదట వెల్గుతున్న జ్యోతి గురువు; దానికి ఆనించి వుంచవలసిన వత్తి శిష్యుడు. పూర్ణుడైన గురువుచెంత అచంచలమైన భక్తివిశ్వాసాలతో ఆయనను విడువకుండా సేవించడము, ఆయన తమ ఆచరణ, సాన్నిధ్యాలద్వారా విరజిమ్మే వెల్గును తానుపొంది నిల్పుగొనడమే కర్తవ్యం.

అయితే ఈ కార్యం సఫలమవాలంటే వెల్గవలసిన జ్యోతికి చాలినంత నూనె అందించాలి. 'నూనె'ను సంస్కృతంలో 'సంస్కారము' అనిగూడ అంటారు. అలానే గురుకృపకు మానవుడు అర్హుడవాలంటే వాడికి మంచి సంస్కారము యివ్వాలి. ఇది తల్లిదండ్రుల కర్తవ్యం - మొట్టమొదట తల్లిది, తర్వాత తండ్రిది కర్తవ్యం. వెనుకటికాలంలో తల్లిదండ్రులు తమ బిడ్డలను ఉత్తమంగా సంస్కరించుకొనడమొక్కటే తమ ప్రధాన కర్తవ్యంగా జీవించగలిగితేనే పిల్లలకిట్టి సంస్కారం కలుగుతుంది. బిడ్డలు వారి ప్రేమను తనివితీరా గ్రోలి, దాని ప్రభావంవలన వారు చూపించిన మార్గంలో వికాసం చెందడమే ప్రీతికరమవ్వాలి. ప్రేమగూడ-జ్ఞానంవలె-మరొక ప్రేమజ్యోతినుండి వెలిగించుకొనవలసినదే. ఏ కారణంగానైనా తల్లిదండ్రులకు పిల్లలనిలా పెంచడం సాధ్యంగాకపోతే పిల్లలకు జీవితాంతము మరొకరిని ప్రేమించడం చేతగాకుండా పోతుంది. అటుపైన జ్ఞానాన్ని, గురువును సాటి శిష్యులను ప్రేమించడం సాధ్యంగాకుండాపోతుంది. నేటి మన సమాజంలో కనిపిస్తున్న నైతిక పతనానికంతటికీ ఇది లోపించడమే కారణం. ప్రేమ లేకుండా పెరిగిన అటువంటి తరానికి కలిగే సంతతి ఈ ప్రపంచంలో సంస్కారంలేని సాటి ఖైదీలుగా మాత్రమే జీవించగలుగుతారు. అవినీతి, నేరము, భయము, అసూయ, ద్వేషము, దురాశ, హింసాస్వభావము - యివే కఠోరమైన జీవిత సత్యాలుగా రూపొందుతాయి. సాటి వ్యక్తికోసం కించిత్తైనా శ్రమపడడానికి, పంచుకోవడానికి సంసిద్ధులు కాలేకపోతారు.

బిడ్డలను ఉత్తమ సంస్కారవంతులుగా తీర్చిదిద్ది సమాజానికందించడమే తమ ధ్యేయంగా తల్లిదండ్రులు జీవించగలిగితే గాని సమాజంలో ఉత్తములైన గురువులు, శిష్యులు, జ్ఞానసముపార్జన అనేవి వుండజాలవు.

మనకెవరిపై ప్రేమ వుంటుందో వారికి యిష్టమైనదే మనకూ యిష్టమవుతుంది; వారికి కష్టమైనదే మనకూ కష్టమవుతుంది. ఇది మానవసహజం. గురువుకు జ్ఞానంయందు ప్రీతివుంటే ఆయనపై ప్రేమ లేక భక్తిగల శిష్యులకుగూడా కలుగుతుంది. బిడ్డలకు ప్రేమించగలగడము, ప్రేమను గుర్తించి పొందగలగడము తల్లిదండ్రులు నేర్పాక జ్ఞానాన్ని ప్రేమించి దానికోసం సాధన చేయడమెలాగో గురువు నేర్పగలుగుతాడు. ఈ విషయం నేటి మనస్తత్వ శాస్త్రజ్ఞులందరూ గుర్తిస్తున్నారు; అలనాటి మన ఋషులు ఆచరించిచూపారు. కారణం ప్రేమ గురించి చెప్పినంత మాత్రాన ప్రేమించడం చేతకాదు. మానవ జీవితమనే పైరుకు సారవంతమైన భూమివంటిది ప్రేమ. అది వున్నప్పుడే మానవజీవితమనే మొక్క స్వస్థతగా పుష్టిగా పెరుగుతుంది; దాని ఆధారంగానే విజ్ఞానమనే ఆకాశంవైపుకు నిటారుగా పెరుగుతుంది. జ్ఞానమనే ఆకాశాన్ని ఆలింగనం చేసుకోడానికి తన హృదయపుష్పాన్ని సంపూర్ణంగా వికసింపజేసుకోగలుగుతుంది. మానవుని హృదయంలో విత్తనంలో అంకురంలా దాగివున్న శక్తి సామర్థ్యాలన్నీ సంపూర్ణంగా వికసించగలుగుతాయి.

ఇట్టి సామర్థ్యాలలో మొట్టమొదటిది ప్రేమ. అది వికసించినపుడు ధర్మమే మన నైజమవుతుంది. సత్యమే గమ్యమవుతుంది. అప్పటికిగాని యితర పశుపక్ష్యాదులతో సమానంగా మానవుడు పంచుకున్న పశుత్వమనే మొగ్గ పక్వానికొచ్చి మానవత్వమనే పువ్వుగా వికసింపజాలదు.

సరిగా వికసించిన మానవత్వనైజంలోని ప్రధానాంశం జిజ్ఞాస–ఆకాశంలో వెల్గే సూర్యుడు, చంద్రుడు, చుక్కలు – యివన్నీ ఏమిటి? ఎలా వచ్చాయి? ప్రకృతిలోని వస్తువులు, జీవులు – అన్నీ ఎలా వచ్చాయి? యిటువంటి ప్రశ్నలన్నీ తలెత్తటం మానవనైజం. ఇంకొంచెమెదిగాక సుఖదు:ఖాలు, జీవన్మరణాలు – ఎలా ఎందుకు కలుగుతాయి? జీవితానికీ, సృష్టికీ గమ్యమేమిటి? సర్వజీవులు సుఖంగా మనేదెలా? అన్న ప్రశ్నలు సహజంగా హృదయంలో ఉత్పన్నమవుతాయి. ఈ ప్రశ్నలకు సమాధానంకోసం అన్వేషించడమే జీవిత లక్ష్యమవుతుంది. అలా అయితేనే మనలో మానవత్వం వికసిస్తున్నట్లు గుర్తు. మిగిలిన ప్రాకృతిక జీవితమంతా ఒకవంక ప్రేమతో సాటివారి హితంకోసం, మరొకవంక సత్యాన్వేషణకోసం ప్రయత్నించాలి. అంతేకాక సాటివారిపట్ల మన మనోభావాలను నిశితంగా పరిశీలించుకోవాలి. యాంత్రికంగా నేటి సమాజంనుండి మనం నేర్చుకున్న విలువలను సృష్టి–ప్రకృతి–మానవజీవితాల తత్త్వాల దృష్ట్యా పరిశీలిస్తే, అవి ఎండమావులలా, సూర్యుని వెలుగుముందు మంచుతెరలలా వీడిపోతాయి. మన హృదయమనే పలకమీద మనం వ్రాసుకున్న పిచ్చిగీతలను చెరుపుకుని సర్వాంగ సుందరమైన అక్షరపంక్తిని వ్రాసుకోవచ్చు. అలా జరిగిన ఆరోజున అలనాటి ఋషులయుగం ఈ క్షణంలో యిక్కడనే వున్నది. అలా జరగనంతవరకు మనకు సంబంధించినంతవరకు అది ఎప్పుడూ ఎక్కడాలేదు. అలా జరిగిన క్షణంలో తల్లిదండ్రులు తల్లిదండ్రులవుతారు; బిడ్డలు విద్యార్థులవుతారు. ఉపాధ్యాయులు గురువులవుతారు; కలియుగం సత్యయుగమవుతుంది. ప్రాణము, చైతన్యముగల మనం అవి రెండూ లేని వస్తువులపట్ల బానిసలుగా ప్రవర్తించము. డబ్బుకు మనం సేవచేయము. డబ్బు మన సేవకుడవుతుంది. అది ప్రాణాలుతీయదు; ప్రాణం పోస్తుంది. జీవితమే విద్యాలయం. హృదయమే గురువు. దానిని నిశితంగా పరిశీలించుకొనడమే జిజ్ఞాస. అపుడే జీవితమొక కథగాక కళ అవుతుంది. అందుకుపయోగించనిది విద్యయేగాదు.

---

Continued from page 13...

గురుచరిత్ర కూడా చెబుతుంది. అంటే మనం భౌతికంగా పూజ చేసుకోవడానికి వీలుపడనప్పుడు మానసికంగా ఎక్కడైనా, ఎప్పుడైనా బాబాను పూజించుకోవచ్చు. అయితే ఎలా చేసినా భావయుక్తంగా పూజచేయడం ముఖ్యం.

ఈ వ్యాసంలో వ్రాసిన అర్థాలు ప్రామాణికాలు కావు – ఎందుకంటే ఇంతకంటే మంచి అర్థాలు కొందరికి స్ఫురించవచ్చు. అప్పుడు ఏవి ఉన్నతమైన భావాన్ని మనలో నింపుతాయో వాటినే అనుసరించవచ్చు. ఎందుకంటే బాబా శ్రీ సాయిలీలామృతంలో ఇలా అంటారు–

"ఇంతకంటే మంచి అర్థమొస్తే అలాగే చదువవచ్చుకదా!" అని.

జై సాయి మాస్టర్

---


## జై సాయి మాస్టర్!

దివ్యజనని అలివేలు మంగమ్మతల్లి ఆశీస్సులతో గురుపూర్ణిమ 2009 నుండి శ్రీ గురుపాదుకా పబ్లికేషన్స్‌వారి ప్రచురణలన్నింటిపై ప్రచార నిమిత్తం 35% Discount భక్తులకు శ్రీ మంగభరద్వాజ ట్రస్ట్ తరపున అందజేయుచున్నారు. వివరాలకు.......

08592 – 233271

# శ్రీ దత్తలీలామృతము

july సంచిక తరువాయి (శ్రీ దత్తాత్రేయస్వామి చరిత్ర) – శ్రీమతి శ్రీదేవి

సహ్యాద్రి కొండపై దత్తాశ్రమాన్ని సందర్శించిన అలర్కుడు ఎంతో ఆతృతతో ఆశ్రమం లోపలికి ప్రవేశించాడు. అక్కడ కొలువుతీరివున్న శ్రీ దత్తాత్రేయస్వామిని చూచి దిగ్భ్రాంతుడైనాడు. కోటిసూర్యుల కాంతితో వెలిగిపోతున్న దివ్య మంగళ విగ్రహం! శుద్ధ స్పటికంవలె స్వచ్ఛమైన దేహకాంతి! కరుణ జాలువారే ఆ కన్నులు! తల్లి ఒడినుండి జారిపడి, ఆమెకు దూరమై, ఎంతోకాలం ఆమెకై ఏడ్చిఏడ్చి సొమ్మసిల్లిన పిల్లవాడికి హఠాత్తుగా అమ్మ కనిపిస్తే కలిగే ఉద్వేగం స్వామిని చూడగనే అలర్కుని మనసంతా ఆవరించింది. పరుగున వెళ్ళి స్వామి రెండు పాదాలపై శిరస్సుమోద్చి, "స్వామీ! స్వామీ! నన్ను కాపాడు! నా కష్టాన్ని తొలగించు. నా దు:ఖాన్ని పోగొట్టు. నాకు నీవుతప్ప వేరు దిక్కులేదు. కరుణించి నన్ను రక్షించు అంటూ భోరున విలపించాడు. "నాయనా! అలర్కా! లే. శాంతించు. నీ దు:ఖాన్ని యిప్పుడే తొలగిస్తాను. భయపడకు" అంటున్న స్వామి అభయవాక్కులు విని అలర్కుడు లేచి నిలబడి చేతులుజోడించి యిలా వేడుకున్నాడు. "స్వామీ! దు:ఖ సముద్రంలో మునిగిపోయి వున్నాను. నన్ను కడతేర్చండి".

తన విశాల నేత్రాలను మరింత విశాలంచేస్తూ స్వామి ప్రశ్నించాడు.

"దు:ఖమా? నీకా?"

"అవును స్వామీ! నా రాజ్యం పోయింది. నా సర్వస్వాన్నీ కోల్పోయాను. దిక్కులేని వాడనయ్యాను. ఇక నాకు దు:ఖముకాక మరేమి మిగిలింది?" అంటున్న అలర్కునివైపు చిరునవ్వుతో చూశాడు స్వామి.

"రాజా! ఎందుకు నీకు దు:ఖం? ఎక్కడుంది ఆ దు:ఖం? అసలు నువ్వంటే ఎవరు? ఎక్కడున్నావు? నాకు చూపించు" అని స్వామి అంటుంటే అలర్కుడు ఆలోచించసాగాడు.

శ్రీ దత్తాత్రేయస్వామి యింకా యిలా అన్నారు – "ఇదిగో! ఎదురుగా కన్పిస్తున్నదే నీ శరీరం. ఈ శరీరావయవాలలో నీవెక్కడున్నావు? ఇవికాక వీటిని నడిపిస్తున్నవాడు కూడా వున్నాడు కదా! అతడే నీవా? అయితే ఆ రూపరహితుడికా దు:ఖం? ఎవరికి దు:ఖం? ఎక్కడుంది ఆ దు:ఖం? ఏదీ చూపించూ...." అంటూ స్వామి అలర్కునిపై తన యోగదృష్టిని సారించాడు.

అలర్కుడు ఆలోచిస్తున్నాడు – 'అవును నిజంగా నేనంటే ఎవరు? ఈ శరీరమా? ఇది ఒక జడపదార్థం. సుఖదు:ఖాలేవీ దీనికి తెలియవు. ఈ శరీరం ఏ పంచభూతాలతో నిర్మింపబడిందో ఆ పంచభూతాలయిన గాలిని నేనా? భూమిని నేనా? నిప్పును నేనా? నీటిని నేనా? లేక నేను ఆకాశాన్నా? ఊహూ' – వీటిలో ఏ ఒక్కటీ నేను కాదు. ఈ శరీరం నా ప్రమేయం లేకుండానే అనేక మార్పులు చెందుతున్నది. దీనిపై నా అధికారమేమీ వున్నట్లు కన్పించటంలేదు. అయితే దీనిని ఉపాధిగా తీసుకొని సుఖదు:ఖాలకు కారణభూతమైన మనస్సు నేనా? దానికి రూపమే లేదు. ఈ మనస్సును, శరీరాన్ని నడిపిస్తున్న మరోశక్తి ఏదో నాలో వున్నది. అది ఏమిటి? అదే జీవాత్మ అని చెపుతారు కదా! మరి ఆత్మకు ఏ రూపంలేదనీ అది సర్వవ్యాపకమనీ కూడా అంటారు. అంతటా నిండివున్న ఆ ఆత్మకు దు:ఖం ఏముంటుంది? కనుక నాకు దు:ఖమెక్కడిది? నాకు అతి

సన్నిహితంగా వున్నా యీ శరీరమే నేను కాదు, మనస్సు కూడా నేను కాదు. అటువంటప్పుడు నా రాజ్యంలోని ధనము, సంపదలు, రథములు, ఏనుగులు, గుఱ్ఱాలు, సైనికులు-యివన్నీ నేను ఎట్లా అవుతాను? నాకు, వీటికీ సంబంధమేమిటి? అంతా నేనయినప్పుడు, ఒకే నీరు ముంతలోను, కుండలోను, బిందెలోను, కమండలంలోను వున్నట్లు - కాశీరాజు, సుబాహువు, నేను వేరుకాదు. నేనేవారు-వారేనేను. కనుక నాకు మిత్రులు లేరు, శత్రువులు లేరు. నేను యీ కంటికి కనిపించే సమస్త దృశ్య ప్రపంచానికి అతీతుడను. దు:ఖరహితుడను. అవును! సర్వాంతర్యామియైన ఆత్మస్వరూపుడనే నేను. నాకు దు:ఖం లేదు, లేనేలేదు'.

ఇలా వితర్కించుకొన్న అలర్కుడు స్వామికి నమస్కరించి యిలా అన్నాడు - "స్వామీ! మీ అనుగ్రహంతో సత్యాన్ని గ్రహించగలిగాను. కేవలం ఆత్మస్వరూపడనే నేను. నాకు యిప్పుడు దు:ఖం లేదు. దు:ఖమనేది పంచభూతములచే పంచభూతములకు కలుగుతున్నది. మనం ఒక కోడిపిల్లను పెంచుకొంటుంటే దానిని పిల్లి తిన్నప్పుడు మనకు బాధకలుగుతుంది. అదే సమయంలో అదే పిల్లి ఏ పిచ్చుకనో, ఎలుకనో తింటే మనకేమీ దు:ఖం కలుగదు. మమకారంచేతనే యీవిధంగా జరుగుతున్నది. కాని నేను ప్రకృతికి అతీతుడ్ని. కనుక నాకు సుఖము లేదు, దు:ఖము లేదు. నిర్వికార, నిరామయ, పరమానంద స్వరూపుడనే నేను అన్న సత్యం నాకు యిప్పుడిప్పుడే అర్థమవుతున్నది".

స్వామి నవ్వి "వున్నమాట చెప్పావు. "మమ" దు:ఖానికి, "నమమ" సుఖానికి మూలము. రాజా! లోతుగా ఆలోచించి, వితర్కించుకొని ఆ "మమ" అన్న భావాన్ని పోగొట్టుకున్నావు".

చూడు అలర్కా! ఈ సంసారమనే విచిత్ర వృక్ష పోకడ ఎలా వుంటుందో తెలుసా? హృదయమనే క్షేత్రంలో సంచిత ప్రారబ్ధకర్మల వలన ఏర్పడిన అజ్ఞానమనే పాదులో మొట్టమొదటగా అహంకారమనే మొలక పుడుతుంది. అది పెరిగి పెద్దదౌతున్నపుడు దానికితోడైన మమకారము బలిష్టమైన మానుగా రూపుదిద్దుకుంటుంది - గృహములు, భూములు, సంపదలు కొమ్మలై విస్తరించగా భార్యాబిడ్డలు, బంధువులు చిగుళ్ళుగా వృద్ధిచెంది పుణ్యపాపాలనే పుష్పాలను పూయిస్తాయి. ఆ పుష్పములనుండి సుఖదు:ఖాలనే పండ్లు కాయగా ఆ సుఖదు:ఖానుభూతులు తుమ్మెదలై వాటినాశ్రయిస్తాయి.

మూఢులైనవారు యీ వృక్షాన్ని పెంచగా అది పెరిగి పెరిగి మహావృక్షమై విస్తరించి చివరకు జ్ఞానమార్గాన్ని కప్పివేస్తుంది. ఈ వృక్షనీడలో సేదదీరటానికి అజ్ఞానులు దీనినాశ్రయిస్తుంటారు. అటువంటివారికి ఈ వృక్షపు నీడ నిజంగా సుఖానివ్వగలదా? లేదు. భ్రాంతితో చేరిన వారికి సుఖానికి బదులు జన్మపరంపరలనే తీరని దు:ఖాలే ప్రాప్తిస్తాయి గానీ వారాశించిన ఆనందం అక్కడ లభింపనే లభింపదు.

అలర్కా! తెలివిగల నరులు విద్య అనే గొడ్డలిని సత్సాంగత్యం అనే సానపై పదునుపెట్టాలి. ఆ గొడ్డలితో యీ మమతా వృక్షాన్ని తెగనరికివేసినప్పుడే సత్యతత్త్వాన్ని చేరుకొనే మార్గం కనిపిస్తుంది. ఆ మార్గంలో నడచివెళ్తుంటే చివరకు పరమ శాంతము, పరమానంద భరితమైన బ్రహ్మ వనమును చేరుకొంటారు. అప్పుడు యీ జనన మరణ చక్రాన్ని దాటినవారై పరమార్థాన్ని సాధించినవారౌతారు.

ఏమి రాజా! "పంచభూతములచే నిర్మిపబడిన యీ స్థూల శరీరము నీవు కావు. పంచతన్మాత్రలు, అంత:కరణ చతుష్టయములతో గూడుకున్న సూక్ష్మ శరీరము కూడా నీవు కావు. మరి నీవెక్కడున్నావో గ్రహించావా? త్రిగుణములతో నిండివున్న యీ శరీరాన్ని నడిపించే నియంతను గుర్తించావా? బాగా ఆలోచిస్తే అంతా తానే అయి సర్వవ్యాపిగా వున్నప్పటికీ నీటిలో చేప, మేడిపండులో కీటకం వేరుగా వున్నట్లు ఎలా అనిపిస్తున్నాయో, అదేవిధంగా దేహంలో ఆత్మస్థితుడై వున్నాడు. దీనిని గుర్తించగలిగినప్పుడు నీకు దు:ఖము ఎక్కడిది?" అన్నారు.

- సశేషం

# 'బాలోన్మత్త పిశాచవత్' అన్న శాస్త్రవర్ణనకు వాస్తవరూపం.

**(శ్రీ చీరాల స్వామి ఆరాధనా మహోత్సవ ప్రత్యేక వ్యాసం)**

- ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

1963వ సం॥లో శ్రీసాయినాథుని సమాధివద్ద సత్పురుషుల దర్శనము, ఆశీర్వచనము లభించాలన్న నాప్రార్థనకు ఫలితమే ఫలితమే నాకు చీరాలలో నివసించిన శ్రీ అవధూతస్వామి వారి దర్శనం.

1966లో కొంతకాలం జిల్లెళ్ళ మూడి అమ్మ సన్నిధిలో వున్నాను. అప్పుడు టైఫాయిడ్ జ్వరం వచ్చి, తగ్గి 23వ రోజున పథ్యం పెట్టాక తిరగపెట్టింది. అమ్మ సలహామేరకు నేను చీరాలలోని డా॥ శ్రీధరరావుగారి ఆసుపత్రిలో చేరాను.

రోజు రాత్రి 11 గం॥ దాకా డాక్టర్ గారితో సత్కాలక్షేపం చేసేవాణ్ణి. పగలంతా "మాతృశ్రీ" ఆంగ్ల సంచికలకు వ్యాసరచనార్థం బైబిల్, కొరాన్ వంటి గ్రంథాలను చదవటం, వ్యాసాలు వ్రాయడం, ప్రెస్‌నుంచి వచ్చే ప్రూఫ్‌లు దిద్దుకోవడం, సాటిరోగులతోనూ నన్ను చూడవచ్చిన మిత్రులతోనూ మహాత్ముని గురించి చెబుతూండడం - పగలంతా ఇదీ కాలక్షేపం. ఇలా వుండడంతో నాకక్కడ ఆస్పత్రిలో పేషెంటు ననిపించేదేకాదు.

ఇలా కొద్ది రోజులు గడిచాయి. ఒక రోజు చీరాలవాస్తవ్యుడైన ఒక మిత్రుడు అన్నారు: "మీకు మహాత్ములంటే ఇంత ఆసక్తి వుందని నాకు తెలియదు ఈ ఊళ్లో ఒక స్వామి వున్నారు. ఆయన చాలా గొప్పవాడని కొందరంటారు. ఆయనను చూచి మీ అభిప్రాయం చెప్పండి. ముందుగా నేనేమీ చెప్పను. ఆయనకు గడ్డమూ, జడలూ వుంటాయి. బోదకాలు మాసిన గుడ్డలతో చాలా ఏవగింపుగా వుంటారు. ఎవర్నీ ఏమీ అనరు. ఆయన పేరూ, ఊరూ ఎవ్వరికీ తెలియదు, పాతిక ముప్పై సం॥ల నుంచి చీరాలలో తిరుగుతున్నారు. తెల్ల గాంధీ బొమ్మ దగ్గర, స్కూల్ పక్క వీధిలోనూ ఎక్కువగా తిరుగుతుంటారు. ఈ గుర్తులు చెబితే మీకెవరైన ఆయన ఆచూకీ చెబుతారు" అని. ఇంక నాకాయనను చూచేదాకా నిద్ర పట్టేట్లు లేదు. మర్నాడే నన్ను చూడటానికి ఆస్పత్రికి వస్తున్న సోదరులు శ్రీమారుతీ రామారావుగారితో వారిగురించి చెప్పాను.

"కానివ్వండి, జ్వరం పూర్తిగా తగ్గనివ్వండి తగ్గాక చూద్దురుగాని" అన్నారు.

"అలా కాదు? ఆయనను వెంటనే చూడాలి. దాని వల్లేమి నాకు జ్వరం ఎక్కువవదు. తగ్గినా తగ్గవచ్చు. కారణం ఆయన దర్శనం నాకు ప్రసాదించడానికే శ్రీసాయి నాకాజ్వరాన్ని, అమ్మ ఆజ్ఞను, మిత్రుల సూచననూ ఇచ్చి వుండవచ్చని తోచింది. అందుకే మరింత పట్టుదలగా మాట్లాడాను.

మరుసటి రోజు మధ్యాహ్నం 2 గం॥ల సమయంలో శ్రీమారుతీ రామారావు రిక్షా తెప్పించి నన్ను తెల్ల గాంధీ బొమ్మ వద్ద నున్న "కృష్ణమూర్తి హోటల్" కు తీసుకు వెళ్ళారు. ఆ హోటల్ ఒక పెంకుటిల్లు, అరుగుల మీదకు వాలిన పెంకుల పంచలో గోడనానుకొని కూర్చున్న ఒక వికృత రూపాన్ని చూపించి శ్రీ మారుతి అన్నారు, "వీరి గురించే మీరడగింది" అని. నేనాశ్చరపోయాను. ఆయన పిచ్చివాడై వుండవచ్చుకానీ స్వామియై వుండరనుకున్నాను ఆధ్యాత్మిక సంపన్నుల ముఖంలో వుండే దివ్యతేజస్సు ఆయనలో ఏ మాత్రం లేదు. శరీరం, గుడ్డలు బాగా దుమ్ము కొట్టుకుపోయి వున్నాయి. ఎడమకాలు పిక్కదగ్గర్నుంచీ పాదమంతా విపరీతమైన బోదకాలు. జట్టు జడలు కట్టి పాయలు పాయలుగా వ్రేలాడుతోంది. అప్పుడే టిఫిన్ తిన్న చిహ్నంగా గడ్డంనిండా, మూతి నిండా, చేతి మీద ఇడ్లీ పలుకులు, పచ్చడి అంటుకుని వున్నాయి. వయస్సు సుమారు 55 సం॥లుంటుంది. కొంచెం స్థూలకాయుడు. మనస్సులో ఏ ఆలోచనలూ లేనివాడిలా కళ్ళు ఆర్పుతూ, ప్రపంచంలో ఏ వస్తువు, ముఖమూ పరిచయం లేనివ్యక్తిలా నిర్వికారంగా రోడ్డు మీదకు చూస్తున్నారు. తన రెండు చేతి వేళ్ళనూ ముడిచి ఒక చేతి వేళ్ళ మధ్య కణువులతో మరొక చేతివేళ్ళ మధ్య కణుపులను తరచు నొక్కుతూ, పళ్లు గట్టిగా బిగిస్తున్నారు. నేను కాసేపు అలాగే నిలబడిపోయాను .ఆయన వికృతంగా నోరు తెరచి ఆవలించారు. ఇతరులు అసహ్యంగా చూస్తారన్న స్పృహ ఆయనకున్నట్లు లేదు. నోరు తెరవడానికి ఎంత వరకూ వీలుంటుందో అంతవరకూ తెరచి ఆవలించిన నోట్లో కొన్ని పండ్లు ఊడి, కొన్ని మొదళ్ళు కదులుతూన్న దశలో కన్పించాయి. ఒక్కక్షణం నమస్కరిద్దామని తలంపు వచ్చినా

ఆయనసలు మహాత్ములు కారేమోననీ, పిచ్చివారేమోననీ, ఆయనకు మొక్కుతూంటే అందరూచూచి ఏమనుకుంటారోననీ వెనకాలోచన వచ్చింది. వెంటనే ఆయన మొట్ట మొదటసారిగా ఒక్కచూపు నాపై విసరి మళ్ళీ నన్ను తన నిర్లక్ష్యసాగరంలో ముంచివేశారు. అప్పుడునాకు “నేనాయన దృష్టికిరాలేదా? లేక నేనే చేస్తానో గమనించి తర్వాత నాపట్ల తమ వైఖరిని నిర్ణయించుకో చూస్తున్నారా?” అని ఆలోచన వచ్చింది. అయితే నాకాక్షణంలో ఒక్క సంగతి మెరుపు మెరసినట్ల వగతమయింది. అదేమిటంటే ఆయన రూపంలో, చూపులో ఏమీ విశిష్టత లేకపోయినప్పటికి ఆయన పట్ల నా మొదటి అభిప్రాయం సడలింది. ఆయన సన్నిధిలో నామానసిక స్థితి మారింది. ఆ తర్వాత 10, 15 ని॥ల సేపు నేనెవరోనన్న విషయం, నాకుజ్వరమన్న సంగతీ, పక్కనమిత్రుడున్న సంగతీ పూర్తిగా మరుపొచ్చింది. నా బాహ్యదృష్టి ఆ వికార రూపం పైన నిలచినా, ఆదెప్పుడో నిర్లిప్తంగా అయిపోయింది. మనస్సు ఏ రూపు ధరించకుండా అలా ఖాళీగా, ప్రశాంతంగా, నిర్మలంగా ఉండిపోయింది. తిరిగి ఆస్పత్రికి నేను వెళ్ళాలన్న సంగతి గుర్తుకు రావడంతో నాజ్వరం సంగతి కూడా గుర్తుకు వచ్చింది. చివరకు ఎలాగో సాహసించి, “నమస్కారం స్వామి!” అన్నాను. ఆయన పలుకలేదు. అసలు వినిపించుకున్నట్లే లేదు. మళ్ళీ అదేమాట అన్నాను. మళ్ళీ మౌనమే. చివరకు ఎలాగైనా సరే నేను తిరిగి ఆస్పత్రికెళ్ళేలోగా ఒక్కసారైనా ఆయన దృష్టి నాకర్షించి, ఆయన నాకేసి చూచే విధానాన్ని బట్టీ, ఏదైనా ఒక్కమాటైనా ఆయన మాట్లాడితే ఆ మాట తీరునుబట్టి, వారికి నాపైగల వైఖరిని గమనించాలనీ సంకల్పంతో ఆయన పాదాలు తాకి నమస్కరించాను. ఆయన ఏమీ పట్టనట్లు, అవి తన పాదాలే కానట్లు కూర్చున్నారు. నేను అలాగే ఇంకొంచెం సేపు నిలుచుని, “వెళ్ళొస్తాను స్వామి! నమస్కారం!” అన్నాను. అనాసక్తతతో కూడినమౌనమే మళ్ళి సమాధానం!

ఆ రోజుకి వెనక్కువెళ్ళి, మరురోజు నేను ఒక్కణ్ణే అదేచోట స్వామి దర్శనం చేసుకున్నాను. శ్రీస్వామి నిర్లక్ష్య వైఖరిలో ఎలాంటి మార్పు లేదు.

ఇంతలో నామనస్సులో ఒక భావం మెరుపులా మెరిసింది. నా యిష్టదైవమైన శ్రీ శిరిడీ సాయినాథుడు తనకూ ఇతర మహాత్ములకూ భేదంలేదనీ, తానే సకల సాధుస్వరూపుడననీ చెప్పడమేగాక, తమ భక్తులకు నిదర్శన పూర్వకంగా నిరూపించారు కూడాను. అటువంటప్పుడు వీరి రూపంలో మాత్రం ఆయనెందుకుండరు? కనుక ఈయన మహాత్ముడే అయితే నేను వందసార్లు సాయి నామం స్మరించే లోగా ఈయన తన కృపకు చిహ్నంగా ప్రసాదమేదైనా నేనడగకనే ఇవ్వాలి. అలా జరిగినట్లైతే నేను మళ్ళీ వీరిని దర్శించవచ్చు. లేకపోతే నేను వీరి దగ్గరకు రానవసరం లేదు. ఇలా అనుకుని మనస్సులో సాయిని స్మరించ నారంభించాను.

నేను సుమారు ముప్ఫై సార్లు సాయి నామం స్మరించానో లేదో గోడ కానుకుని కూర్చున్న స్వామి అర్ధ పద్మాసనంలో నిటారుగా కూర్చుంటూ నాపైన దృష్టి కేంద్రీకరించి తన జేబులోంచి ఒక చార్మినార్ సిగరెట్టు, అగ్గిపెట్టె తీసి నా చేతికిచ్చి, ‘సిగరెట్టు కాల్చుకో స్వామి” అన్నారు. యాంత్రికంగా చేయి చాపానే కాని ‘నా కలవాటు లేదు’ అని చెప్పాలనిపించింది. వెంటనే నా మనస్సు మేల్కొని “ఆయన కృపకు చిహ్నంగా ప్రసాదం కోరింది నీవే. ప్రసాదమిస్తూంటే కాదనటమేమిటి?” అని హెచ్చరించింది. వెంటనే సిగరెట్టు దమ్ము పీల్చాను. అదే మొదటిసారి కావడంతో పొరబోయింది. ఎలాగో ఆ సిగరెట్టు పూర్తి చేశాను. అది పూర్తియేలోగానే స్వామి నాకు మరో సిగరెట్టిస్తూ ‘కాల్చు’ అన్నారు. ఆపైన ఇడ్లీ, దోసె, ఉప్మా, చెట్నీవగైరాలు వరుసగా ప్రక్కహోటల్ నుంచి తెప్పించి యిచ్చారు. ఇక తినలేనని మనస్సులోనే చెప్పుకున్నాను. అంతే! మరేమీ యివ్వలేదు.

స్వామి సన్నిధిలో నాకు కలిగే చిత్తశాంతి చాలా గాఢమై నన్ను తీవ్రంగా వారి వైపుకాకర్షించేది. ఆయనను దర్శించినపుడల్లా నాకు కలిగే చిత్తశాంతి ఆ తర్వాత సుమారు నెల రోజులు వుండి నేను నిత్యమూ చేసుకునే ధ్యానాన్ని ఎంతో పటిష్టం చేసేది. ఆయన దగ్గరకు వెళ్తూంటే నా తండ్రి దగ్గరకు నేను పోతున్నట్లనిపించేది. ఈ అఖిల జగత్తూ ఒక యెత్తు, ఆయనొక్కరూ ఒక యెత్తు అనిపించేది.

స్వామి దేహక్షాళన ఏనాడూ చేసుకునేవారుకాదు. బహిర్దేశానికి వెళ్ళినా, ఏదైనా ఆహారం స్వీకరించినా దేహాన్ని కడుక్కునేవారుకాదు. ఆయన కట్టుకున్న గుడ్డలు చెప్పలేనంతగా మాసి వుండేవి. రోడ్ల మీదా, రోడ్ల ప్రక్కన, చెత్తకుండీల ప్రక్కన, మురుగుకాలవల ప్రక్కన, స్మశానంలోనూ, తాళం వేసి వున్న ఇండ్ల పంచల మెట్ల మీద, వరండాలలోనూ కూర్చునేవారు. బుద్ధిపుట్టినప్పుడు ఎక్కడ కూర్చుని వుంటే అక్కడే పడుకునేవారు. కండ్లు పుసికట్టి

నీరుకారిపోతున్నా దాన్ని తుడుచుకునేవారు కాదు. ఇతరులను తుడవచిచ్చేవారూకారు. ఎప్పుడైనా ఎవరైనా బలవంతాన తుడవబోతే "నీ కెందుకయ్యా అంతబాధ"అని వారించేవారు. ఆయన సామాన్యంగా ఎప్పుడూ ఎవరితోనూ మాట్లాడేవారు కారు. తనకు తోచినప్పుడు ఎదుట పడ్డ వ్యక్తిని "ధర్మమియయ్యా" అని చేయి చాపేవారు. వారివ్వకపోతే ఆయనేమీ అనేవారు కారు. వెంటనే ఆయనకు మరెవరైనా డబ్బివ్వబోతే కొందరి దగ్గర తీసుకునేవారు; కొందరి వద్ద నిరాకరించేవారు. ఆయన గుడ్డలూ, శరీరమూ అంత మురికిగా వున్నప్పటికీ ఆయన సమీపాన ఈగలు ముసరడం గానీ, దుర్గంధం కానీ ఏమీవుండేవికావు. ఒక్కొక్కప్పుడు తనలో తాను పకపకా నవ్వుకొనేవారాయన. అరుదుగా పక్కవారికి వినిపించనంత నెమ్మదిగా ఏదో గొణుక్కోవడం కూడా కద్దు. సూర్యాస్తమయ సమయంలో తన దగ్గర ఎవరుండటమూ ఆయనకు యిష్టం లేనట్లుగా తోచేది. ఆ సమయంలో పళ్ళు పటపట కొరుకుతూ రెండు చేతివేళ్ళనూ ముడిచి ఒక చేతి వేళ్ళ కణువులతో మరోచేతి కణువులను గట్టిగా నొక్కి రాస్తూండేవారు. ఆ కారణంగానే కాబోలు వ్రేళ్ళ కణువుల పైభాగాలు కాయలుకాసివుండేవి. భక్తులెవరైనా ఆయనకు నమస్కరించినప్పుడు ఒక్కొక్కప్పుడు ప్రతి నమస్కారం చేసేవారు; ఒక్కొక్కప్పుడు నిర్లిప్తంగా ఊరుకొనేవారు. ఆయనకు బుద్ధి పుట్టినప్పుడు భక్తులతో "అగ్గిపెట్టె, సిగరెట్లు, బీడీలు, ఊదువత్తులు, కర్పూరం తీసుకురాస్వామి" అనేవారు. అవి తీసుకురాగానే కర్పూరం నేలమీద పెట్టి వెలిగించి ఆ మంటలోనే ఆగరొత్తులన్నీ వెలిగించి అవిచివరిదాకా మండిపోయేదాక చేత్తోపట్టుకుని కూర్చునేవారు. ఆ మంటలోనే అగరొత్తి పెట్టెలనూ, పై కాగితాలనూ కాల్చేసేవారు. ఆ తర్వాత సిగరెట్టు కాల్చేవారు. ఆయన సిగరెట్లు కాల్చే పద్ధతి వింతగా వుండేది. తడవకు మూడు సార్లు చొప్పున క్లుప్తంగా, త్వరగా దమ్ము పీలుస్తు అలా మూడుసార్లు (అంటే మొత్తం తొమ్మిదిసార్లు) పీల్చేసి ఆ సిగరేట్టును నేలమీద పెట్టి యింకొక సిగరెట్టును వెలిగించేవారు. కాల్చేసిన సిగరెట్టును ఒక దాని వెనుక ఒకటి లైనుగా నేల మీద పెట్టేవారు. ఒక్కొక్కప్పుడు కాలిపోయిన, బీడీలను అలాగే అక్కడే వదిలేసి అక్కడ నుంచీ లేచి వెళ్ళిపోయేవారు. ఒక్కొక్కప్పుడు కాలిపోయిన అగ్గిపుల్లల గుండ్రటి తలలను విరచి నడినెత్తిన వేసుకునేవారు అలానే ఒక్కొక్కప్పుడు సిగరెట్ల బూడిదను నెత్తికిరాసుకునేవారు. అప్పుడప్పుడు కాలుతున్న సిగరెట్లతో చేతివేళ్ళ కణువుల మీదవున్న బుడిపెలను కాల్చి చుఌమన్నప్పుడు పక్కున నవ్వుకునేవారు. సిగరెట్టు తను కాలుస్తూ ఒక్కొక్కప్పుడు భక్తునికొక సిగరెట్టిచ్చి కాల్చుకోమనేవారు. ఒక్కోసారి సిగరెట్టిచ్చి దాచుకోమనేవారు. మరొకప్పుడు ఖాళీ సిగరెట్టు పెట్టెలను, అగరొత్తి పెట్టెలను భక్తులకిచ్చి "ఇవి జేబులో పెట్టుకోయ్యా" అనేవారు.

## శ్రీస్వామివారికి రెండు సమాధులా?

శ్రీ చీరాల స్వామివారిని ఎవరైనా తమ పేరు, ఊరు అడిగితే ఒక్కొక్క సారి ఒక్కొక్క పేరు చేప్పేవారు. ఒకసారి త్రివేణి స్వామి అని, మరొకసారి షణ్ముఖస్వామి అని, ఇంకొకసారి నరశింహస్వామి అని, మరొకసారి రామస్వామి అని – ఇలా! అటువంటివారు ఒకసారి కంపౌండరు చంద్రం, మరియమ్మలను పిలిచి తమ సమాధి కడప జిల్లాలోని మూలపల్లి వద్ద ఏటికవతల గొల్లపల్లిలో వున్నదని, అక్కడికి ఒకసారి వెళ్ళిరమ్మని చెప్పారట. స్వామి సాక్షాత్తు కళ్ళకెదురుగా కన్పిస్తూ తమ సమాధి ఇంకొక చోట వున్నదని చెప్పేసరికి మరియమ్మ బిత్తరపోయి, అదెలాగని ప్రశ్నిస్తే "ఎవరైనా తెలిసినవారి నడుగమ్మా! నేను చెప్పకూడదు" అన్నారు. ఆ తరువాత ఎంత వత్తిడిచేసినా సమాధానం చెప్పలేదు. శ్రీభరద్వాజగారు ఒకసారి చీరాల వెళ్ళగా ఈ విషయం చెప్పి అర్థమడిగాడు చంద్రం. శ్రీ భరద్వాజగారి ఆదేశం ప్రకారం శ్రీ బి.రామకృష్ణా రెడ్డి విచారించగా అటువంటి గ్రామం నిజంగానే వుందని, ఆ ఏటివడ్డున చాలాకాలం క్రితం జీవ సమాధి అయిన ఒక గొప్పయోగి జీవసమాధి వుందని, ఈనాటికీ, ప్రతి మంగళ, శనివారాలు పూజలు, ప్రతి మహాశివరాత్రికీ ఆరాధనోత్సవములు జరుగుతుంటాయని తెలిసింది. అయితే ఈ వివరం తెలిసేసరికే శ్రీ చీరాలస్వామి దేహత్యాగం చేసారు.

---

చదవండి! చదివించండి!

శ్రీ అవధూత చీరాల స్వామి చరిత్ర

రచన: ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

ప్రతులకు: శ్రీ గురుపాదుకా పబ్లికేషన్స్, M.M.Donka, Ongole - 523 002, 08592 – 233271

# ఇలా ఆలోచిద్దామా?

## (దివ్యజనని అలివేలు మంగమ్మ జయంతి మహోత్సవ సందర్భంగా......)

-శ్రీమతి వేదవతి

పూజ్యశ్రీ అమ్మగారి జన్మదిన వేడుకల సందర్భంగా ఈరోజున మనం అసలు ఆలోచించుకోవలసినదేమిటి? – వారి జీవిత విశేషాన్నా, బోధలనా? జాగ్రత్తగా ఆలోచిస్తే ఈ రెండూ వేరుకావు. వారి బోధల ఆచరణ నిరూపణే వారి జీవితమంతా. సాయి మార్గంలో వారు పయనిస్తూ మనలకు మార్గదర్శకులుగా వుంటూ ఈనాటి మన జీవిత విధానంలోనే ఆధ్యాత్మికతను మేళవించుకుంటూ బాబా మార్గంలో ఎలా పురోగమించాలో వారు మనకు చెబుతూ వచ్చారు. ఆచరించి చూపించారు. అలాగే ఆ ప్రయత్నంలో అడుగడుగునా మనమెదుర్కొనే అంతరంగికమైన, బాహ్యమైన సమస్యలను ధైర్యంతో ఎలా ఎదుర్కోవాలో, వాటిని ఆధ్యాత్మిక దృష్టితో ఎలా అన్వయించుకోవాలో మనకు సూచనలిస్తూ వున్నారు. అయితే అలాంటి జీవితాన్ని చూడడానికి, ఆ సూచనలను, సన్నిధిని అందుకోవాలంటే మనం గత జన్మలలో ఎంతగా కృషిచేసి వుంటామో! అయితే తీరా అది చేతికొచ్చాక మనం దానిని సరిగా వినియోగించుకోవాలి కదా!

బాగా ఆలోచిస్తే అదే – అది మాత్రమే మనం కృషి చేయాల్సిన విషయం – ఎందుకంటే దాని ద్వారా మాత్రమే మనం పురోగమించగలం – ఐహికంగానూ, ఆధ్యాత్మికంగానూ, అది మనం ఎంతమేరకు వినియోగించుకోగలుగుతామో అంతమేరకు మనలో ఆధ్యాత్మిక పురోభివృద్ధి తీసుకురావడం వారి బాధ్యత అవుతుంది. దాని గురించి మనం పెద్దగా ఆలోచించాల్సిన అవసరం లేదు. ఐహికంగా కూడా పురోభివృద్ధి కలుగుతుంది, ఎందుకంటే – ఐహికంగా మనకేది అవసరమో అది వాళ్ళే చూసుకుంటామని వారే వాగ్దానం చేసివున్నారు. మనకు ఐహికంగా ఏలోటూ రాకుండా వారు చూసుకుంటారు. ఇక మనకేమైనా కోరికలుంటే అవి పారాయణ ద్వారా తీర్చుకునే మార్గం వారే చెప్పివున్నారు. చెబుతున్నారు. అవి సరైన శ్రేయస్కరమైన కోరికలైతే అవి తప్పక నెరవేరుస్తారు. అలా మనం అధర్మం వైపుకు పోకుండా కూడా వారే చూసుకుంటున్నారు. ఒకవేళ అలా తీరని దృఢమైన కోరికలుంటే అవి కూడా పట్టుబడితే తీరుస్తున్నారు – అయితే ఇక్కడ ఒక విషయం మనకు స్పష్టం చేశారు – అలా పట్టుబట్టిన సందర్భాలలో ఆ కోరిక ఆయన తీరుస్తారు కానీ పర్యవసానాలు ఇక మన బాధ్యతన్నమాట! అంటే ఆ తర్వాత అలాంటి కోరిక తీరడం మూలంగా వచ్చే సమస్యలకు మనమే బాధ్యులం – అంతగా పట్టుబట్టాం కాబట్టి! అంటే దీనిలో ఒక శిక్షణా సూత్రం వున్నది – అదే మనలోని అలాంటి పట్టుదలలను సడలించడం. ఆ పరిస్థితులను ఎదుర్కొన్నప్పుడు మనలో వివేకం మేలుకొంటుంది – ఎలా– " బాబా ఎందుకు చేయలేదో నాకిప్పుడర్థమైంది – నా మొండి పట్టుదలవల్ల ఈ సమస్యలను నేనే కొని తెచ్చుకున్నాను – అందుకే బాబా మనకు శ్రేయస్కరమైనదే చేస్తారు" – అని అర్థమౌతుంది. ఇక అప్పటినుంచి అలా పట్టుబట్టలేడు – "బాబా ఎందుకీ కోర్కె తీర్చలేదో! ఏదో మంచి వుండి వుంటుంది" అని తెలుస్తుంది. అంటే బాబా మీద భారమేయడం చేతనౌతుంది. కొద్దిగా పురోభివృద్ధి సాధించినట్లేకదా! అంతేకాదు, అప్పుడెన్ని పరిస్థితులెదురైనా సంతృప్తితో వుండగలుగుతాం. అంటే మనం ఐహికంగా ఏది లేక యిన్నాళ్ళూ నిరంతరం ఆరాటపడుతున్నామో అది మనకు దక్కుతుంది. అప్పుడు ఐహికంగా సంతోషంగా వుండగలుగుతాం.

అయితే దానికి మొదటిమెట్టు వారి పాదాలను విడవకుండా పట్టుకోవడమే. అలానే వారితో వ్యవహరించేటప్పుడు ఆత్మవంచన లేకుండా వుండాలి. అప్పుడే వారు మనలోని లోపాలను సరిచేయగలుగుతారు. మనలో మనకు కనిపించే లోపాలను వారితో నిర్భయంగా చెప్పుకోవచ్చు. వారి కరుణతో వాటిని తొలగించుకునే మార్గం చెబుతారు. అలాగే మనం వారిసేవ చేస్తున్నప్పుడు వారంతట వారే మనలో మనకు తెలియని లోపాలను సరిచేసుకోవడానికి సూచనలిస్తారు. అటువంటి సమయాలలోనే మనకంటే వారికి ఎక్కువ తెలుసునని గుర్తించుకుని వినయంతో వారి సలహాలను పాటించాలి. అంతేకాక ఇక్కడ ఇంకొక విషయం బాగా గుర్తించుకోవాలి – అన్నీ సుఖంగా నడిచిపోతూ, వారు మనతో ప్రేమగా వ్యవహరిస్తున్నప్పుడు వారిపట్ల భావం సడలకపోవడం చాలా సాధారణ విషయం. అలాగాక వారు మనలోని లోపాలను గమనించి తొలగించేందుకు ప్రయత్నించే సమయంలో వారు మనతో కఠినంగా వ్యవహరించవచ్చు. అటువంటప్పుడే మనం మామిడి

పూతలాగా రాలిపోతామా, చెట్టునే అంటిపెట్టుకుని పండుగా మారతామా తెలిసిపోతుంది. సరిగ్గా ఆలోచించుకుంటే మన సత్తా ఏమిటో మనకే అర్థమౌతుంది. అప్పుడు వారిని వినయంతో మన తప్పును తెలియజెప్పమని భక్తితో ప్రార్థించాలి. ఆ తర్వాత ఆ తప్పుకు మనసారా క్షమాపణ చెప్పుకుని, అలాంటి స్వభావాన్ని, సంస్కారాన్ని తొలగించుకోవడానికి వారిచ్చే సూచనను భక్తి ప్రపత్తులతోను, శ్రద్ధతోనూ పాటించాలి. అలా ఆ స్వభావం తొలగిపోయేవరకూ తీవ్రమైన కృషి చేయాలి. అలాంటి చెడ్డ సంస్కారాలను తొలగించుకోవడమే వారి సన్నిధియొక్క ప్రయోజనం. ఈ విషయంలో స్పష్టత చాలా అవసరం. ఎందుకంటే అదే సందర్భాలలో ప్రతి ఒక్కరికీ మరొక అపాయం పొంచివుంది – అదే అహంకారంతో వారి గొప్పతనాన్ని , స్వచ్ఛతను అనుమానించడం, వారు మారిపోయారనుకోవడం. ఇది సాధారణంగా మనలో మనకు తెలియని లోపాలపట్ల వారు కఠినంగా వ్యవహరించినపుడు వివేకలోపం వల్ల వచ్చే ఉపద్రవం. అటువంటి సందర్భాలలో వాటిని తెలుసుకునేందుకు వినయంతో వారిని ఆశ్రయించేబదులు, ఎన్నో జన్మల కృషి వల్ల వారి సాన్నిధ్యాన్ని పొందికూడా వారిని అహంకారంతో ధిక్కరిస్తాం – వారిని అనరాని మాటలంటాం, దుష్ప్రచారం చేస్తాం. తద్వారా వారి సాన్నిధ్యాన్ని ముందు జన్మలలో కూడా పొందలేనంతటి పాపం చేస్తాం – తద్వారా ఇహపరాలు రెండిటికీ చెడుతాం.

ఇక్కడ మరో ఆత్మవంచన కూడా సంభవం – అదేమిటంటే వారు మనతో కఠినంగా వ్యవహరించారు కాబట్టి వారినుంచి దూరంగా వుంటూ వారి పటం రూపంలో వారు మనింట్లోనే వున్నారని, వారిని మనం విశ్వాసం సడలకుండా సేవిస్తున్నామనే భ్రమించడం అలాంటి ఆత్మవంచనలో వివేకం వక్రంగా పనిచేసి ఆ సందర్భంగా "నా పటం రూపంలో నేనెప్పుడూ వుంటాను!" అని బాబా అన్న విషయాన్ని మనసు అడ్డం వేసుకుంటుంది – మనం విశ్వాసాన్ని కోల్పోయామన్న నిజాన్ని అహంకారంతో ఒప్పుకోలేక, ఆ నిజాన్ని ఎదుర్కోలేక! ఆయన పటం రూపంలో మన ఇంట్లో వుండటం ముమ్మాటికీ నిజం, అయితే ఆ విశ్వాసం మనకు లేదనడం కూడా అంతే నిజం. ఎందుకంటే ఆ వాక్యాన్నే నిజంగా మనం నమ్మినట్లయితే – వారి దగ్గరకు భౌతికంగా వెళ్ళలేనివాళ్ళం ఆ పటం వున్న గదిలోకి, అలానే మనింట్లోకి మనం వెళ్ళలేం. కాదంటారా?

అందుకే ఇంటిదొంగను కనిపెట్టడం చాలా కష్టం. మన మనస్సే మనలను పరిపరివిధాల మోసం చేస్తుంది. దాని వలలో పడకుండా వుండాలంటే మళ్ళీ వారి పాదాలే శరణ్యం.

ఇక్కడ ఒక్క విషయం స్పష్టంగా గుర్తుంచుకోవాలి. మనలో ఎన్నో లోపాలున్నాయి కాబట్టి, ఈ జన్మలోనో, పూర్వజన్మలలోనో వాటిని తొలగించుకోవాలని తీవ్రంగా తపించాం కాబట్టే మనకు సద్గురు సాన్నిధ్యం లభించింది. అంటే మనమొక శిక్షణా శిబిరంలో చేరాం. అందులోని శిక్షకుడు సాటిలేనివాడు – మనకు తెలిసినా తెలియకపోయినా ఆ శిక్షణలో శిక్షలు తప్పవు, మన రోగాలకు చేదు మందులూ, పత్యాలూ తప్పనట్లు! ఇందులో ఒక రోగిని ఇంకొక రోగి తక్కువగా చూసేందుకేమీలేదు. అందరూ రోగగ్రస్తులే. ఎవరికి తగిన మందు వారికివ్వడం వైద్యుడి బాధ్యత, వృత్తి ధర్మం. అలాగే తమను ఆశ్రయించినవారి సంస్కారాన్ని బట్టి వారికి శిక్షణనివ్వడం సద్గురువుల ప్రత్యేకత. అందుకే సద్గురు ప్రశంశే నిజమైన ప్రశంశ. ఆయన శిక్షణలో స్వచ్ఛులమై అనంత శాంతి, ఆనంద శిఖరాలను అందుకోవడమే వారిని ఆశ్రయించడంలోని లక్ష్యం.

ఇంకొక చిన్న సాధారణ బలహీనత వున్నది. అదే సాటి భక్తులతో పోలిక. వారిని మనతో పోల్చుకుని వారిపట్ల అరిషడ్వర్గాలను పొందుతాం. వాటిని కూడా అనుక్షణం గుర్తిస్తూ అవి మనలోని లోపాలేనని తెలుసుకుని వాటిని తొలగించుకునేందుకు మనవంతు ప్రయత్నం మనం చేస్తూ, వాటిని సద్గురువుచెంత ఒప్పుకుని వారి సూచనలను పాటించాలి. గురుబంధువులందరమూ వారిదగ్గర శిక్షణ పొందేందుకు వచ్చిన వారమేనని గుర్తుంచుకుని, సాటి భక్తులపట్ల సమ్యమనంతో వ్యవహరించాలి. అలా మన ప్రయత్నంతోనూ, వారి అండతోనూ స్వచ్ఛులమై బాబా మార్గంలో పయనించేందుకు ఉద్యుక్తులౌదాం. అప్పుడే సద్గురుమూర్తి అయిన అమ్మకు సంతోషం. అదే ఆమె అవతార కార్యం.

జై సాయిమాష్టర్ !!

ఓం సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయనమః:

# శ్రీ సాయి లీలామృతము

(మొదటి Edition నుంచి)

july సంచిక తరువాయి

అధ్యాయము – 11

# బాబా ఎవరు?

ధూమల్ యిలా వ్రాశాడు: "నాకు 1912వ సం॥లో వైద్యులు మత్తిచ్చి ప్రమాదకరమైన ఆపరేషన్ చేసారు. నాకు స్పృహతప్పే లోపల సాయి నా తలవైపు కుర్చీలో కూర్చొని కనిపించారు. ఆయన నా అండనున్నారని ధైర్యం కలిగింది. ఆపరేషన్ సక్రమంగా జరిగింది."

బల్వంత్ ఖోజోకర్ 1911లో ఒకరోజు బాబా వద్ద సెలవు తీసుకొని కొంత దూరం వెళ్ళాక అదే సాయిని తాను చివరిసారిగా చూడటమేమోనన్పించి మరొక్కసారి ఆయనను దర్శిస్తే బాగుండుననుకున్నాడు. కాని సాయివద్ద సెలవు తీసుకున్నాక తిరిగి ఆయనను దర్శించరాదు. అలా అనుకొంటూ ప్రక్కనే లెండీకేసి చూచాడు. కంచెలోంచి బాబా తొంగిచూచి, 'వెళ్తున్నావా? మంచిది వెళ్ళిరా!' అన్నారు.

బాబా సర్వవ్యాపి. భక్తులకు అనేకచోట్ల అనేక రూపాలలో దర్శనమిచ్చేవారు. అది వారి చిత్తభ్రమకాదని ధృవపరిచే వారుకూడా. రేగే 1914లో తన కుమార్తె వివాహానికి బాబానాహ్వానించాడు. వివాహానికి స్వయంగా రాగలనని బాబా జాబువ్రాయించారు. సరిగా ముహూర్తానికి పోస్టులో సాయి విభూతి, దానిని వధూవరుల నొసట పెట్టమన్న జాబు రేగేకందాయి. అదే సమయానికొక ఫకీరొచ్చి అతని మామగార్ని ఒక పైసా దక్షిణకోరాడు. పని తొందరలో ఆయన పట్టించుకోలేదు. కాని తర్వాత ఆయన బాబాయేమోనని తోచి బాధపడ్డాడు. ఆయన బాబా అయితే మరుసటి రోజుకూడా రావాలని రేగే అన్నాడు. మర్నాడు ఫకీరొచ్చి పైస దక్షిణ తీసుకున్నాడుగానీ, భిక్ష స్వీకరించలేదు.

దహనులో దేవ్ తల్లి ముప్పైనోములు పూర్తిచేసి 200మంది బ్రాహ్మణులకు సంతర్పణ చేయదలచింది. దేవ్ సాయిని సంతర్పణకు రావలసిందిగా జాబువ్రాశాడు. "నేను, నీవు, మరొకరూ కలిసి ఉద్యాపనకు రాగలమని వ్రాయి. నాకు వాహనమేమీ అవసరంలేదు" అని సాయి జోగ్‌తో చెప్పారు. ఆ జాబు చూచి శిరిడీ వీడని సాయి ఎలా రాగలరా? అని తలచాడు దేవ్. కొద్దిరోజుల ముందు గోసంరక్షణ నిధికోసమొక సన్యాసి దహను వచ్చాడు. ఆ సమయంలో మరొక ధర్మకార్యానికి విరాళాలు సేకరిస్తున్నారని, రెండు మాసాల తర్వాతైతే, కార్యం నెరవేరగలదనీ చెప్పి దేవ్ అతనిని పంపాడు. కాని ఉద్యాపన రోజున ఉదయం 10 గం॥లకు ఆ సన్యాసి వచ్చాడు. తాను ఉద్యాపన కార్యంలో వున్నానని చెప్పిన దేవ్‌తో, తాను విరాళాల కోసం రాలేదని, భిక్షకోసమొచ్చాననీ, తనతో మరో యిద్దరున్నారనీ సమయానికి తానే రాగలననీ చెప్పి సన్యాసి వెళ్ళిపోయాడు. తర్వాత ఆ ముగ్గురూ సంతర్పణకొచ్చి భోజనంచేసి వెళ్ళారు. కొద్దిరోజుల తర్వాత బాబా తనమాట తప్పారనీ, ఉద్యాపనకు రాలేదనీ నిష్టూరంగా దేవ్ జోగ్‌కు వుత్తరం వ్రాశాడు. అతడా వుత్తరం విప్పకమునుపే సాయి, "నేను మాట తప్పానని దేవ్ నిష్టూరంగా వ్రాసిన జాబులే! కాని వాస్తవంగా యిద్దరితో కలిసి విందారగించాను. అతడు గుర్తుపట్టలేదు. నేను విరాళాలకు రాలేదనీ, నాతో మరో యిద్దరు ఉద్యాపనకు రాగలరనీ చెప్పి అతనికెరుకపరచుకో చూచాను. నేనెప్పుడూ మాట తప్పను. నన్ను గుర్తుపట్టలేనివాడు, ఎందుకు ఆహ్వానించాలి?" అన్నారు. ఆ మాట జోగ్ దేవ్‌కు వ్రాశాడు. దేవ్, అతని తల్లి చాలా సంతోషించారు.

నాచ్నే అన్నగారు సం॥ 1909లో ప్రమాదమైన శస్త్రచికిత్సకని బొంబాయిలో ఆస్పత్రిలో చేరారు. దహనులో అతని కుటుంబమంతా ఆందోళన పడుతున్నారు. ఒక సాధువు భిక్షకొచ్చారు. నాచ్నే వదినగారు బెండకాయకూర ఆ మహనీయునికి తగిన వంటకం కాదని తలచి, వేరేకూర చేసి వడ్డించింది. కాని ఆయన ఆ కూరనే అడిగి వేయించుకున్నారు. భోజనం అయ్యాక, బొంబాయిలో శస్త్రచికిత్స సక్రమంగా జరిగిందని చెప్పి, వెళ్ళిపోయారా సాధువు. సాయి దయవలన అలానే జరిగి వుండవచ్చుని నాచ్నే

మిత్రుడన్నాడు. సాయి గురించి నాచ్నే వినడమదే ప్రథమం. అస్పత్రినుండి ఆ సాయంత్రం తిరిగి వచ్చిన అతని తండ్రి శస్త్రచికిత్స బాగానే జరిగిందనీ, ఆ వెంటనే ఒక సాధువొచ్చి రోగిని తాకి, త్వరలో జబ్బు తగ్గగలదనీ చెప్పి వెళ్ళారని అన్నారు. తర్వాత 1912లో ప్రథమంగా శిరిడీ వెళ్ళి నాచ్నే కొన్ని రోజులక్కడే వున్నాడు. ఒకరోజు సాయి అతని గురించి భక్తులతో, "నేనొకప్పుడితనింటికి వెళ్ళాను. ఇతని వదినగారు అడిగితేగాని నాకు బెండకాయ వేయలేదు" అన్నారు. తానెరుగకముందే సాయి తననాశీర్వదించారని నాచ్నే ఆశ్చర్యపోయాడు. చిత్రమేమిటంటే ఆ తర్వాత అనేకసార్లు తాను ఆ సాధువును దహనులో చూచాడు కూడాను!

పురందరే భార్యకు తీవ్రంగా విరేచనాలవడం వలన చాలా బలహీనంగా వున్నది. గంటకు మించి బ్రతకదని డాక్టర్లన్నారు. బజారుకు వెళ్ళిన పురందరేకు కబురుచేసారు. అతడు త్వరగా ఇంటికొస్తుండగా దారిలో దత్తమందిరం వద్ద బాబా కనిపించి, "భయపడకు, ఈ ఊదీ నీళ్ళలో కలిపి తాగించు. అరగంటలో ఆమె కోలుకుంటుంది. మిమ్మల్నందరినీ నేను కాపాడుతున్నాను" అన్నారు. అతడిల్లుచేరి బాబా చెప్పినట్లు చేసాడు. ఆమె వెంటనే కోలుకోవడంతో డాక్టర్లాశ్చర్యపోయారు.

ఒకసారి పురందరే నూతన గృహప్రవేశానికి అనుమతికోరుతూ సాయికి జాబువ్రాశాడు. "గృహప్రవేశం గురువారం జరిపించు; నేనుకూడా వస్తాను" అని సాయి జాబు వ్రాయించారు. గురువారం పురందరే సాయి పటం తీసుకుపోతుండగా, దత్తమందిరం వద్ద సాయి కన్పించి, వారిని అనుసరించారు. నూతన గృహంలో ఆ పటాన్ని ప్రతిష్టించేంత వరకూ వుండి మరుక్షణం అదృశ్యులయ్యారు!

సం॥ 1909లో ఒకనాడు సాయి శ్రీమతి కణీత్కర్‌తో, "నేనూ, అంగోన్‌కవాడ్ నివాసి సఖారామ్ మహరాజ్ ఒకే గురువును సేవించాము. మేమిద్దరం కలిసి మామిడి మొక్కలు నాటాము. నేనా చెట్లనుండి రెండు పండ్లనుకోసి నీకు పంపాను" అన్నారు. ఆమెకేమీ అర్థంకాలేదు. మర్నాడు ఆమె ఇంటికి బయలుదేరి, కోపర్గాము చేరేసరికి అక్కడ దేవాలయంలో ఒక బ్రహ్మచారి కన్పించి, 'సాయి వీటిని నీకు పంపారు' అంటూ రెండు మామిడిపండ్లను ఆమెకిచ్చాడు. శిరిడీలోని సాయి అంగోన్‌కవాడ్‌లోని పండ్లనెలా కోశారు? కోపర్‌గామ్‌లో బ్రహ్మచారికెలా యిచ్చారు?

అదమ్‌దలాలీ యిలా వ్రాశారు: "సాయి ఇతర రూపాలలో కూడా నావద్దకొచ్చారు. ఒకప్పుడొక బ్రాహ్మణుని రూపంలో వచ్చి దక్షిణడిగారు. రెండణాలిచ్చాను. మరోసారి మార్వాడీ రూపంలో వచ్చి తనకాకలిగా వుందన్నారు. నాల్గణాలిచ్చి మార్వాడీ హెూటల్లో భోజనం చేయమన్నాను. నేను శిరిడీ వెళ్ళినప్పుడు సాయి భక్తులతో, "నేనీతని దగ్గరకెళ్ళినప్పుడు నన్ను మార్వాడీ హెూటల్లో భోంచేయమన్నాడు'' అన్నారు. నన్నాశ్చర్యపరిచేది సాయి సర్వవ్యాపకత్వం కంటే కూడా సంకల్పమాత్రాన వివిధ భౌతిక రూపాలను ధరించగలగడమే!

ఇతర రూపాలలో దర్శనమిచ్చినప్పుడు భక్తులు గుర్తించక, కించపరిచినప్పటికీ, వారిని సాయి కరుణించటమే విశేషం. "నేనెవరిమీదా కోపించను. తల్లి బిడ్డలమీద ఎప్పుడైనా కోపిస్తుందా? సముద్రమెప్పుడైనా నదులను తిప్పి పంపుతుందా? నాకు భక్తి ప్రియమైనది. నేను భక్తుని బానిసను" అనేవారు. భగవద్గీతలో కృష్ణుడు తనను సముద్రంగాను, వివిధ మార్గాలలో సాధనచేసేవారిని నదులుగానూ పోల్చిన దానికెంత సన్నిహితంగా వున్నాయో ఈ మాటలు!

సాయి తన భక్తులకు స్వప్నదర్శనమిచ్చి సందేశాలనందచేసేవారు. ఒకనాటి సాయంత్రం రహతా నుండి కుశాల్‌చంద్‌ను తీసుకురమ్మని సాయి దీక్షిత్‌ను పంపారు. కాని అతడు రహటాచేరేలోపే కుశాల్‌చంద్‌కు మధ్యాహ్నం స్వప్నంలో కన్పించి, వెంటనే శిరిడీ రమ్మని చెప్పారు సాయి! అతడు దీక్షిత్‌తో కలిసి శిరిడీచేరాడు.

పూనాలో ఒక భక్తురాలికి సంతానంలేదు. బాబావద్ద టెంకాయ ప్రసాదంగా లభిస్తే తనకు బిడ్డలు కల్గుతారని ఆమె విశ్వాసం. కాని ఆమె శిరిడీ ఎప్పుడు బయలుదేరినా ఏవో ఆటంకాలొచ్చేవి. ఆమె ఆర్తితో బాబాను ప్రార్థించింది. ఒకరాత్రి బాబా కలలో కన్పించి టెంకాయ ప్రసాదించారు. నిద్రలేచేసరికి ఆమె పక్కలో నిజంగానే టెంకాయ వున్నది! తనకు బిడ్డ కల్గగానే సాయికి సమర్పించుకుంటానని మొక్కుకుంది. సంవత్సరంలోగా మొక్కు తీర్చుకున్నది.

Continued on page 32..

జై సాయి మాస్టర్

# ఆధునిక శాస్త్రం – సృష్టి రహస్యం

– శ్రీ ఎక్కిరాల ద్వారకనాథ్ జ్ఞానేశ్వర్

20వ శతాబ్దం మొదట్లో Sir Albert Einstein (ఐన్‌స్టీన్) అనే శాస్త్రజ్ఞుడు సృష్టి పట్ల ఒక వినూత్న ధృక్పథాన్ని ప్రపంచానికి అందించి అందరినీ అబ్బురపరచాడు. అతడు కనుగొన్న అనేక విషయాలు అప్పటి శాస్త్ర విజ్ఞానాన్ని తల్లక్రిందులుచేసాయి. పదార్థం యొక్క మౌలిక తత్త్వమేగాక space (దేశము), time (కాలము)ల గురించిన అప్పటి శాస్త్రీయ ధృక్పథాన్ని మార్చివేశాడు. అతడు కనుగొన్న Reality Theory (సాపేక్ష సిద్ధాంతం) ఆధునిక మానవచరిత్రలోనే అత్యద్భుతమైన మలుపు. ఆ సిద్ధాంతం ప్రకారం దేశము, కాలము నిర్దుష్టమైనవికాక observer (చూచేవాడు లేక సాక్షి) యొక్క పరిస్థితిపై ఆధారపడి వుంటాయి. అంటే, స్థూలంగా చెప్పాలంటే, ఒక్కొక్కరి దృష్టిలో ఒక గంటసేపు మరొకరి దృష్టిలో ఒక్క క్షణమో లేక ఒక్క యుగంగానో పరిణమించవచ్చు. అంటే చూచేవాడిని బట్టి చోటు (space) కానీ, time (కాలం) కానీ మారిపోగలవన్నమాట. ఆయన ప్రవేశపెట్టిన ఇతర సిద్ధాంతాలు కూడా అనేక అద్భుతమయిన విషయాలను ప్రతిపాదించాయి. ఉదాహరణకు – కాంతి యొక్క వేగం అన్నింటికంటే ఎక్కువ అనీ, ఎవరైనా అంతకన్నా వేగంగా ప్రయాణించగల్గితే వారు కాలంలో వెనుకకు (అంటే భూతకాలానికి) ప్రయాణించవచ్చుని ప్రతిపాదించాడు!

అయితే కాలక్రమేణా ఆయన సిద్ధాంతాలు ఆధునిక శాస్త్ర దృష్టినుంచి కొంత మరుగుపడ్డాయనే చెప్పాలి. ఆయన సిద్ధాంతాలను, తరువాత వచ్చిన Quantum Mechanics (క్వాంటమ్ మెకానిక్స్) వంటి సిద్ధాంతాలు సృష్టినుండి "వ్యక్తి" లేక "సాక్షి"ని విడతీయటానికి వీలులేదని ప్రతిపాదిస్తున్నప్పటికీ శాస్త్రం ఆ "వ్యక్తి" లేక "సాక్షి" యొక్క తత్వాన్ని తరచటం మాని వేరు దిశలో పరిశోధనలు జరిగాయి. అంటే "సర్వం శక్తిమయం" అని చెప్పేవరకు వచ్చిన ఆధునిక భౌతికశాస్త్రం ఇంకా ముందుకువెళ్ళి "అహం బ్రహ్మోస్మి" దాకా వెళ్ళక 1 శతాబ్దంపాటు పక్కదారిపట్టాయన్నమాట. అయితే అంతమాత్రాన శాస్త్రజ్ఞులు తప్పుపోయారని కాదు, వారి దృష్టి ఇతర సమస్యలపై కేంద్రీకృతమయ్యిందని చెప్పాలి. ఉదాహరణకు "ఒకే శక్తి (energy) ఇన్ని రూపాలు ఎలా ధరించింది?", "పదార్థానికి, బలాలకు (forces) గల సంబంధం ఏమిటి?", "ఈ సృష్టిలో ప్రకటమయ్యే అన్ని శక్తి విశేషాలను ఒకే శక్తి విశేషం యొక్క రూపాంతరాలుగా ఎలా చూడవచ్చు?" మొదలైన అంశాలపైకి మళ్ళింది. అంతేకాక భౌతికశాస్త్రం, జీవిశాస్త్రం, మానసికశాస్త్రం (psychology) వేరుగా వుండటంమూలాన ఒక రంగంలో జరిగే విప్లవాలను, ప్రతిపాదనలను రెండవ రంగానికి సమన్వయం చేయటం కష్టమయ్యింది. అందుకని "సాక్షి" లేక "చూచేవాడు" (observer) యొక్క తత్వాన్ని తరచటం భౌతికశాస్త్రానికి కష్టమయ్యింది.

ఇలా సుమారు 70 సం॥లు గడచాయి. ఈ లోపల అనేకమంది శాస్త్రజ్ఞులు వివిధ శాస్త్రీయరంగాలలో ఎంతో పురోభివృద్ధి సాధించారు. ఇలా సాధించిన రంగాలలో Cognitive Neuroscience, Cyber Netics మొదలైనవి ఎంతో వేగంతో పురోభివృద్ధి చెందుతున్నాయి. జీవశాస్త్రం (biology), అందులో భాగాలైన Genetics, జీవరసాయన శాస్త్రం మొదలైనవి ఎంతో వేగంగా అభివృద్ధిని కనబరచాయి. ఇలా

జరగటంతో అప్పటివరకు జంతువులను, మొక్కలను, భూమికి పరిమితమైన అంశాలను మాత్రమే తరచిన ఈ శాస్త్రాలు ఒక్కసారిగా "జీవం", "ఎరుక" మొదలైన ప్రాథమిక అంశాలపై దృష్టిని సారించాయి.

అన్ని జడజీవాలు ఒకదానిపై ఒకటి ఆధారపడి ఎంతో సున్నితము, సన్నిహితము అయిన సంబంధాన్ని కలిగి వుంటాయని, అది "web of life" అని వివరిస్తారు Frifjoft Capra. Gregory Bateson (బేట్‌సన్), Ilya Prigogine (ఇల్యా ప్రగోజీన్) వంటివారు జీవశాస్త్రం, సామాజిక ఆర్థిక శాస్త్రాలలో గల సామ్యాన్ని వెలికితీస్తున్నారు. Steven Pinker (స్టీవెన్ పింకర్), V.S.Ramachandran (రామచంద్రన్) వంటివారు వ్యక్తిత్వము, భాష, మెదడు, మనస్సు మొదలైన అంశాలను పరిశీలించి అద్భుతమైన గ్రంథాలను వ్రాస్తున్నారు. వీటన్నిటినీ గమనిస్తే ఆధునికశాస్త్రం మరింత ముందుకు సాగుతోందని, దాని పయనం ఆధ్యాత్మిక వాదాన్ని బలపరుస్తోందని చెప్పవలసి వుంటుంది.

ఇది యిలా వుండగా కొద్ది నెలల క్రితం "Discover" అనే పత్రికలో "Biocentrigism" అనే వ్యాసం ఒక అద్భుతమైన అంశాన్ని పాఠకులకు పరిచయం చేసింది. Robert Lanza (లాన్జా) అనే జీవశాస్త్రజ్ఞుడు ప్రవేశపెట్టిన "జీవ-కేంద్రక సిద్ధాంతం" సృష్టితత్వాన్ని, జీవతత్వాన్ని సమన్వయపరిచేదిగా వున్నది. ఈ వాదం ప్రకారం సృష్టికి మౌలికంగా తలచబడే దేశకాలాలు (space time) సృష్టికి మాత్రమే (అంటే సాక్షికి సంబంధంలేక) సంబంధించినవి కావని, నిజానికి ఆ సాక్షి (observer) యొక్క మానసిక, వ్యక్తిగత అంశ్శాలు మాత్రమేనని ప్రతిపాదించడం జరిగింది. పాశ్చాత్య ఆధునికశాస్త్రం observer ను తన సమీకరణాలలో లెక్కించకపోవటం వలన సృష్టిరహస్యాలకు, ఎన్నో అంశాలకు తనను తాను మూసివేసుకున్నదని, దానిని పరిగణనలోకి తీసుకుంటే ఎన్నో అద్భుత విషయాలు అర్థమవుతాయని అంటారు లాన్జా.

"Biocentrism should unlock the cages in which western science has unwittingly centined itself. Allowing the observer into the equation should open new approaches to understanding cognition, from unravelling the nature of consciousness.................. and solving problems associated with Quantum Physics and the Bigbang............" అంటారు Lanza.

"According to biocentrism, time doesnot crist independently of the life that notices it".

అనువాదం - "జీవ-కేంద్రక సిద్ధాంతం ప్రకారం కాలమనేది దానిని గుర్తించే జీవాన్ని మించి స్వతస్సిద్ధంగా లేదు".

"Like time, space is neither physical nor fundamentally real in our view".

అనువాదం - "ఈ సిద్ధాంతం దృష్ట్యా దేశము సైతం, కాలం వలెనే, స్వతస్సిద్ధము, మౌలికము అయిన వాస్తవం కాజాలదు".

ఈ సిద్ధాంతం దృష్ట్యా చూస్తే అటు దేశకాలాలు కానీ, వాటి పర్యవసానాలైన పదార్ధము, సంఘటనలు కానీ మౌలికమైన వాస్తవాలు కావట! అవి మన దృష్టి, దృక్పథాలనుబట్టి మన మనస్సులు సృష్టిగూర్చి ఏర్పరచుకునే అభిప్రాయాలు మాత్రమేనని, మనలోని వ్యక్తిగత, మానసిక, ఇంద్రియపరమైన అంశాలు అర్థమైతేగానీ సృష్టితత్వం అర్థంకాదని చెబుతుంది.

అయితే ఈ సిద్ధాంతం కూడా రెండు విషయాలను పరిశీలించక వదిలేస్తుంది. సృష్టి యొక్క ఉనికి, దానిని అనుభవించే జీవి (జీవుల) యొక్క ఉనికి. అసలు ఈ "ఉనికి" అంటే ఏమిటో తెలిస్తేకానీ వున్నదేంటో తెలియదని బౌద్ధంనుండి రమణుల వరకు మహాత్ములందరూ చెప్పేవున్నారు. ఈ సిద్ధాంతం ఇంకా అంతలోతుగా పరిశీలనకు సిద్ధం కాకపోవటం చూస్తే సృష్టిరహస్యాన్ని తరచటంలో ఆధునిక విజ్ఞానశాస్త్రం ఇంకా ఎంతో దూరం ప్రయాణించాల్సి వుందని తోస్తుంది. కాకుంటే వైజ్ఞానికంగా మానవజాతి వేస్తున్న ప్రతి అడుగు ఆధ్యాత్మికవాదాన్ని బలపరుస్తోందని గమనించాలి.

పూజ్య ఆచార్య భరద్వాజులు రచించిన "ఏది నిజం", "విజ్ఞాన వీచికలు" మొదలైన గ్రంథాలలోని ఆధ్యాత్మిక వైజ్ఞానిక సమన్వయం ఆధునిక శాస్త్ర పురోభివృద్ధి వలన బలపరచబడడం చూస్తే ఆయన ఎంతటి సత్యద్రష్ట, జ్ఞాని, మహాత్ముడో అర్థమౌతుంది. అందుకే కాబోలు గురుదేవులన్నారు – సరైన సాధకుడు తన ఆధ్యాత్మికతకు, అప్పటి శాస్త్ర విజ్ఞానానికి సంపూర్ణమైన సమన్వయం కలిగి వుంటాడని.

ఆధునికశాస్త్రం ఆధ్యాత్మికత గురించి ఏమంటుందో మరిన్ని విశేషాలతో మళ్ళీ మీ ముందుకొస్తాను.

**"సర్వే జనా: సుఖినో భవన్తు ! లోకా: సమస్తా: సుఖినో భవన్తు !**

**ఆనో భద్రా: క్రతవో యాంతు విశ్వత: ! తమసోమా జ్యోతిర్గమయ !**

---

Continued from page 28..

పై లీలల దృష్ట్యా బాబా అప్పుడప్పుడు భక్తులతో అన్న మాటలు ఎంత అర్థవంతాలో తెలుస్తుంది. ఒక్కొక్కప్పుడు "నేనిప్పుడే కాశీవెళ్ళి గంగలో స్నానంచేసివచ్చాను. నాకిక్కడ స్నానంతో ఏమి పని?" అనేవారు. మరొకప్పుడు, 'నేనిప్పుడే కొల్హాపురం, ఔదుంబరవాడీ వెళ్ళివస్తున్నాను' అనేవారు. శిరిడీలో నిత్యం హారతిలో బాబాను భక్తులు, "కొల్హాపురంలో భిక్ష, కాశీలో స్నాన జపాలు, నిర్మలతుంగా నదిలో నీరు త్రాగడం, మాహురపురంలో నిద్ర నిత్యమూ సలిపే దిగరంబరుడవైన దత్తాత్రేయుడవు నీవే" అని స్తుతించిన దానికీమాటలెంతగా సరిపోతాయో గమనార్హం.

---

## Statement about ownership and other particulars of SAI BABA (Monthly)
## FORM - IV
## (See Rules 8)

| | |
|---|---|
| 1. Name of the Publication | : SAIBABA |
| 2. Periodicity of its publication | : MONTHLY |
| 3. Printer's Name | : P.Srinivasa Rao |
| Nationality | : Indian |
| Address | : Master Universal Sai Trust, M.M.Donka, Ongole-2 |
| 4. Publisher's Name | : P.Srinivasa Rao |
| Nationality | : Indian |
| Address | : Master Universal Sai Trust, M.M.Donka, Ongole-2 |
| 5. Editor's Name | : P.Srinivasa Rao |
| Nationality | : Indian |
| Address | : Master Universal Sai Trust, M.M.Donka, Ongole-2 |
| 6. Name and Address of individuals who own the News papers and Shareholders holding more than 1% of the total capital | : Advisory Member of Master Universal Sai Trust (Regd.), Ongole-2 |

I, P.Srinivasa Rao, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Ongole (Sd.)P.Srinivasa Rao

1-9-2009